రాత్రిపూట డిప్లొమో కోర్సులపై సందేహాలా?

ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు డిప్లొమో కోర్సులు చేసేందుకు రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతించింది. ఈ విధానంలో పగలు ఉద్యోగం చేస్తూ రాత్రి పూట డిప్లొమో చేసుకోవచ్చు. దీనికి ఇంటర్, ఒకేషనల్, ఐటీఐ తదితర కోర్సులు పాసై, వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు అర్హులు. ఈ రాత్రి కోర్సులకు సంబంధించి పరిశ్రమల్లో అనుభవం, కోర్సు చేస్తే కలిగే ప్రయోజనాలు, అర్హతలు తదితర ఎటువంటి సందేహాలున్నా 'ఈనాడు మీతోడు' ఆధ్వర్యంలో ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి. రమణ నివృత్తి చేయనున్నారు. శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఈ నంబరుకు (8639818869) ఫోన్ చేసి ఆయనతో మాట్లాడి మీ సందేహాలను తీర్చుకోవచ్చు.

– న్యూస్‌టుడే, కంచరపాలెం

ఈనాడు మీతోడు

8639818869 నంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోండి

సమయం: శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య

రేపు నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధి జోన్-2, 3లో శనివారం నీటి సరఫరా ఉండదని ఆ విభాగ కార్యనిర్వాహక ఇంజినీరు టీఎల్ సుధాకర్ తెలిపారు. కొమ్మాది పంపుహౌస్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం కలుగుతోందన్నారు. జోన్-2లోని సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, ఎండాడ, వివేకానందనగర్, రాజీవ్‌నగర్, రుషికొండ, పెద్ద రుషికొండ, 9, 10 వార్డుల్లోని అన్ని ప్రాంతాలు, 11వ వార్డులో గాంధీనగర్, బాలాజీనగర్, అన్నానగర్, 12వ వార్డులోని చినగదిలి, పెదగదిలి, సూర్యతేజానగర్, సాలిపేట ప్రాంతాల్లో.., జోన్-3లోని ఎంవీపీకాలనీ సెక్టారు 1 నుంచి 7 వరకు, 20వ వార్డు పోలమాంబ దేవాలయం, ప్రశాంతినగర్, వర్మగారి రోడ్డు, 22వ వార్డు మంగాపురం కాలనీ, కాగితాలవీధిలో నీటి సరఫరా ఉండదన్నారు.

సంత్రాగచ్చి నుంచి సనత్‌నగర్, బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సనత్‌నగర్-సంత్రాగచ్చి-సనత్‌నగర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సనత్‌నగర్-సంత్రాగచ్చి(07069) ప్రత్యేక రైలు ఈ నెల 30, నవంబరు 6వ తేదీల్లో ఉదయం 6.20 గంటలకు సనత్‌నగర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ చేరుకొని, ఇక్కడి నుంచి 8.57 గంటలకు వెళుతుంది. సంత్రాగచ్చి-సనత్‌నగర్(07070) ప్రత్యేక రైలు ఈనెల 31, నవంబరు 7న సాయంత్రం 5.25 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.48 గంటలకు దువ్వాడ వచ్చి, ఇక్కడి నుంచి 7.50 గంటలకు వెళుతుంది.

- ఎస్ఎంవీ బెంగళూర్-సంత్రాగచ్చి (06211) ప్రత్యేక రైలు ఈనెల 26న ఉదయం 10.15 గంటలకు బెంగళూర్‌లో బయలు దేరి మర్నాడు తెల్లవారుజామున 3.53 గంటలకు దువ్వాడ వచ్చి.., ఇక్కడి నుంచి 3.55 గంటలకు వెళుతుంది. సంత్రాగచ్చి-ఎస్ఎంవీ బెంగళూర్(06212) ప్రత్యేక రైలు ఈనెల 27న రాత్రి 11.30 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 3.10 గంటలకు దువ్వాడ వచ్చి.. ఇక్కడి నుంచి 3.15 గంటలకు వెళుతుంది.

నేడు కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ బోగీ



రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖ-కిరండూల్-విశాఖ (08551-08552) రైళ్లకు అదనపు విస్టాడోమ్ బోగీని జత చేయనున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 25న విశాఖ-కిరండూల్ రైలుకు, 26న కిరండూల్-విశాఖ రైలుకు ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇప్పటికే ఆయా రైళ్లు రెండు విస్టాడోమ్ బోగీలతో రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో.. కాసుల వేట





తనిఖీల సమయంలో పోలీసుల చేతివాటం

కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఎస్సైలు, కానిస్టేబుళ్లపై సీపీ వేటు!

ఈనాడు–విశాఖపట్నం, –న్యూస్‌టుడే, ఎంవీపీ కాలనీ

మద్యం మత్తే విశాఖలో చాలా ప్రమాదాలకు ప్రధాన కారణమని భావించి, దాన్ని అరికట్టేందుకు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెంచారు. దీనిద్వారా మద్యం మత్తుకు కళ్లెం వేయడం పక్కన పెడితే.. తనిఖీల్లో పోలీసులు కాసుల వేట సాగిస్తున్నారన్న ఆరోపణలు ముసురుకుంటున్నాయి.

బ్రీత్ ఎనలైజర్స్‌తో మద్యం సేవించినట్లు గుర్తించి, కేసులు నమోదు చేసే సమయంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఇదే విషయంపై ఫిర్యాదు అందడంతో తాజాగా విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వన్‌టౌన్, మహారాణిపేట స్టేషన్ల పరిధిలోని ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు వేసినట్లు సమాచారం.

అడిగినంత ఇవ్వాల్సిందే..

గత ప్రభుత్వ హయాంలో ఉన్న బ్రీత్ ఎనలైజర్స్ మరమ్మతులతో మూలకు చేరగా, గత పోలీస్ కమిషనర్ సీఎస్సార్ నిధులతో 200 కొత్త యంత్రాలు సమకూర్చారు. ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పోలీసులు చేస్తున్నారు. 100 గ్రాముల రక్తంలో 30 ఎంజీకి మించి ఆల్కహాల్ బ్రీత్ ఎనలైజర్స్‌లో గుర్తిస్తే కేసు నమోదు చేయవచ్చు. ఈ సమయంలో కొందరు పోలీసు సిబ్బంది డబ్బులు భారీగా వసూళ్లు చేస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కోర్టుకు వెళితే, అక్కడ జరిమానా లేదా జైలు శిక్ష పడుతుంది. ఇది పరువు తక్కువగా భావించిన కొందరు ఉద్యోగులు, ఉన్నత కుటుంబాలకు చెందిన యువత ఆ సమయంలో కొందరు పోలీసులు ఎంత అడిగితే అంత సమర్పిస్తున్నారు. ఇదే అదనుగా విధుల్లో ఉన్న సిబ్బంది జేబులు నింపుకొంటున్నారు.

ఆ బండి మాకొద్దు


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మరో వింత పరిస్థితి పోలీసులకు ఎదురైంది. కోర్టులో జరిమానా వేసిన మందుబాబుల వాహనాలను తీసుకెళ్లకపోవడంతో స్టేషన్లు, పార్కింగ్ ప్లేస్‌లు, బస్‌బేల వద్ద ద్విచక్ర వాహనాల సంఖ్య పెరిగిపోయింది. కేసు నమోదు చేసి కోర్టుకు పెడితే జరిమానా రూ.10-20 వేలు వేస్తున్నారు. తనిఖీల్లో దొరికిన వాహనాలు పాతవి కావడంతో, జరిమానా వేసిన ధర కంటే తక్కువ పలుకుతుండటంతో వాటిని తీసుకెళ్లకుండా సంబంధిత యజమానులు వదిలేస్తున్నారు.

- ఇదే విధంగా మద్యం కేసుల్లో పట్టుకున్న వాహనాలు కిక్కిరిసిపోవడంతో గత సీపీ సిటీ పోలీసు మైదానంలో వాటిని పెట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో దొరికిన వారి ఆధార్ తీసుకుని జరిమానా తర్వాత కట్టాలంటూ వాహనాలను అప్పగించారు. గతంలో వాహనాల్ని తనిఖీల్లో పట్టుకోగానే రశీదు రాసి, జరిమానా కడితేనే పంపేవారు. ప్రస్తుతం యాప్‌లోనే జరిమానాలు చెల్లించాల్సి రావడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాల బకాయిలు పెరిగిపోయినట్లు సమాచారం.

తనిఖీల సమయంలో అత్యుత్సాహం : డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో కొందరు పోలీసుల అత్యుత్సాహం వాహన చోదకులకు ఇబ్బందులు కలిగిస్తోంది. వేగంగా వెళుతున్న వాహనాల్ని ఒక్కసారిగా ఆపేందుకు యత్నిస్తుండటంతో చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. నెలన్నర క్రితం సాగర్‌నగర్‌లో ఓ యువకుడిని ఇలానే ఆపేందుకు యత్నించగా డివైడర్‌కు తల తగిలి ఆసుపత్రిపాలై ప్రాణాల మీదకు వచ్చింది. జనావాసాల మధ్య, ప్రమాదకర మలుపుల వద్ద తనిఖీలతో గంటకుపైగా హడావుడి చేస్తుండటం స్థానికులను, అత్యవసర పనులపై వెళుతున్న వాహన చోదకులను ఇబ్బంది పాల్జేస్తోంది.

ఇంధన రంగంలో ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు

గురుద్వారా, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు జాతీయ అవార్డు లభించింది. ఈనెల 22, 23 తేదీల్లో దిల్లీలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ జాతీయ సదస్సులో ఇంధన రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన సంస్థలకు '12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డు ఫర్ డిస్కం' పేరిట అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పలు ఆవిష్కరణలు చేస్తున్నందుకు ఏపీఈపీడీసీఎల్ 'కేటగిరి ఎఫ్-ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్-లార్డ్ డిస్కమ్స్' విభాగంలో అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ అనిల్ రాజన్ చేతుల మీదుగా సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ అవార్డు అందుకున్నారు. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందని సీఎండీ కొనియాడారు.



అనిల్‌రాజన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్

నూతన డీఈఓగా ప్రేమకుమార్



విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్ చంద్రకళను గుంటూరు జిల్లా డైట్ ప్రిన్సిపల్‌గా బదిలీ చేయడంతో పాటు పల్నాడుకు డీఎస్ఈవోగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇక్కడ మూడేళ్ల పాటు డీఈవోగా పని చేసిన ఆమె స్థానంలో విజయనగరం డీఈఓ ప్రేమకుమార్‌ను నియమించారు. ఆయనకు గతంలో పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిగా, ఉమ్మడి విశాఖ జిల్లాలో డిప్యూటీ డీఈఓగా పని చేసిన అనుభవం ఉంది. జిల్లాల విభజన అనంతరం ఆయన అనకాపల్లి జిల్లా ఉపవిద్యాశాఖాధికారిగానూ పని చేశారు.

సంక్రాంతిలోగా గుంతల్లేని రోడ్లు

ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.20 కోట్లు కేటాయింపు

అల్లూరి జిల్లాలో రహదారుల నిర్మాణానికి 1800 కోట్లతో ప్రణాళిక

జడ్పీ సర్వసభ్య సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత



సమావేశ వేదికపై మంత్రి అనిత, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు

ఈనాడు, విశాఖపట్నం: అల్లూరి జిల్లాలో దశల వారీగా డోలీ మోతల్లేకుండా చేయడానికి రూ.1800 కోట్లతో రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. అనిత మాట్లాడుతూ సంక్రాంతి లోగా రూ.20 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని రోడ్లపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పల్లె పండగ పేరుతో 25 జిల్లాల్లో రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేస్తుంటే అల్లూరి జిల్లాకు పైసా కూడా కేటాయించకపోవడం ఘోరమని అక్కడి జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కలెక్టర్ దినేష్‌కుమార్, మంత్రి అనిత సమాధానమిస్తూ ఏజెన్సీలో 1350 పైగా గ్రామాలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదని, వాటన్నింటికీ రోడ్లు వేయడానికి రూ.1800 కోట్ల వరకు అవుతుందన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ నిధులతో పాటు ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి ఇక్కడ పరిస్థితిని వివరించి అదనపు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు.

గంజాయి సాగు నివారణకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అందరి సూచనలు, సలహాలతో జిల్లా సమగ్రాభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

జల్‌జీవన్ పనుల్లో జాప్యమెందుకు?: గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా వదిలేశారని, రోడ్లను తవ్వేసి వదిలేయడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడ్డారు. 'మీరు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రభుత్వం మాటలు కాయాల్సి వస్తోంద'ని మంత్రి అనిత సైతం అసహనం వ్యక్తం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నియోజకవర్గంలోని పలు శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించి వాటిని త్వరితగతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు.



హాజరైన ప్రజాప్రతినిధులు

విశాఖ ఉక్కుపై మా వైఖరి స్పష్టం..: విశాఖ ఉక్కు కర్మాగారం విషయమై పార్లమెంటులో ప్రస్తావించాలని ఓ సభ్యుడు **ఎంపీ శ్రీభరత్‌**ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్టీలుప్లాంటు విషయంలో కేంద్రం నుంచి సానుకూల పరిణామాలు చోటుసుకున్నాయని గుర్తుచేశారు. ప్లాంటు అవసరాల దృష్ట్యా రెండు దఫాలుగా రూ.1700 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. దీన్నిబట్టే ఉక్కు కర్మాగారం విషయంలో తమ వైఖరి ఏంటో స్పష్టంగా తెలుస్తుందన్నారు.



నరేగాను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి..

నరేగా పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయించాలి. కాఫీ తోటల పెంపకానికి నరేగా ద్వారా సహకారం అందేలా చూడాలని, ఈ మేరకు పార్లమెంటులో ఈ సమస్య గురించి ప్రస్తావించాలని ఎంపీలు తనుజారాణి, శ్రీభరత్‌లను ఛైర్‌పర్సన్‌తో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు కోరారు. ఏజెన్సీలో సరఫరా చేసిన రాజ్‌మా విత్తనాల్లో చాలావరకు నాసిరకంగా ఉంటున్నాయని, నాణ్యత లేని విత్తనాలను ఎందుకు ఇస్తున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. బడుల్లో ఉపాధ్యాయుల కొరత గురించి భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు ప్రశ్నించారు. పాఠశాలల్లో పిల్లలతో పనులు చేయిస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం సరకులు దారిమళ్లుతున్నాయని మునగపాక జడ్పీటీసీ సభ్యుడు సోమసత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డీఆర్వోగా బీహెచ్ భవానీశంకర్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు అయ్యాయి. గత పదినెలల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా సేవలందిస్తున్న కె.మోహన్‌కుమార్ చిత్తూరు జిల్లా డీఆర్వోగా బదిలీ అయ్యారు. విశాఖ జిల్లా డీఆర్వోగా బీహెచ్.భవానీశంకర్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్నారు. నగరంలో సివిల్ డిఫెన్సు ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.పద్మలత ను అల్లూరి సీతారామరాజు జిల్లా డీఆర్వోగా నియమించారు. ఆమె స్థానంలో ఎవర్నీ నియమించలేదు. కలెక్టరేట్‌లో భూ పరిరక్షణ విభాగ ఉపకలెక్టర్‌గా పనిచేస్తున్న టి.సీతారామమూర్తిని కాకినాడ జిల్లా డీఆర్వోగా పంపించారు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. సింహాచలం దేవస్థానం ఈఓగా పనిచేసి బదిలీ అయిన ఎస్.శ్రీనివాసమూర్తిని విజయనగరం జిల్లా డీఆర్వోగా పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేయగా, వారిలో విశాఖ జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఉన్నారు.

31న సింహగిరిపై నరక చతుర్దశి ఉత్సవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఈ నెల 31వ తేదీన దీపావళిని పురస్కరించుకుని నరక చతుర్దశి ఉత్సవం వైభవోపేతంగా జరుగుతుందని దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవం సందర్భంగా ఆరోజు సాయంత్రం 5గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని పేర్కొన్నారు. ● అప్పన్న ఆలయంలో నవంబరు 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు శ్రీమణవాళ మహామునుల తిరు నక్షత్రం పూజలు జరుగుతాయని ఈవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో ఆలయంలో జరిగే సహస్రనామార్చన, స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీదళార్చన, గరుడ సేవ, నిత్య కల్యాణోత్సవం వంటి ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వివరించారు.

విశాఖ డెయిరీకి నోటీసులు జారీ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యానికి భీమునిపట్నం ఆర్డీవో సంగీత్ మాథుర్ నోటీసులు జారీ చేశారు. నగరంలోని ఆరిలోవ ప్రాంతంలో సుమారు 7.95 ఎకరాల ప్రభుత్వ భూమిని డెయిరీ యాజమాన్యం ఆక్రమించినట్లు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన పత్రాలతో శుక్రవారం ఉదయం 11 గంటలకు భీమిలి ఆర్డీవో కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించి ఏపీఐఐసీ జోనల్ మేనేజరుకు, పశు సంవర్ధకశాఖ విశాఖ జిల్లా సంయుక్త సంచాలకులకు, విశాఖ గ్రామీణ మండల తహసీల్దారుకు కూడా నోటీసులు జారీ అయ్యాయి.

వసూలు చేసిన చెత్త రుసుములు ఎక్కడ?

- 'సౌకర్యం'లో జమ చేయని వార్డు కార్యదర్శులు
- మొత్తం రూ.3 కోట్లు ఉంటుందని అంచనా



న్యూస్‌టుడే, కార్పొరేషన్: వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణ రుసుములను వసూలు చేసిన వార్డు కార్యదర్శులు కొంత మంది ఆ నిధులు జీవీఎంసీకి చెల్లించకుండా తమ వద్దే ఉంచుకోవడం చర్చనీయాంశమైంది. జీవీఎంసీ పరిధి ఎనిమిది జోన్లలో కలిపి రూ.3కోట్ల వరకు కార్యదర్శుల నుంచి రావాల్సి ఉంటుందని జీవీఎంసీ అధికారులు అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త ఛార్జీలను రద్దు చేస్తున్నామని ప్రకటించింది. ఈ మేరకు జోనల్ కమిషనర్లకు మౌఖిక ఆదేశాలు ఇచ్చాయి. వారు వెంటనే చెత్త రుసుముల వసూలు నిలిపివేయాలని వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. అయితే అప్పటికే బకాయి పడిన నిధులను కొంత మంది కార్యదర్శులు నివాసితుల నుంచి వసూలు చేసుకున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన బకాయి నిధులు పూర్తిగా జీవీఎంసీకి చెల్లించకుండా, కొంత మొత్తం తమ వద్దే ఉంచుకున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో.. వార్డుల్లోని గృహాలు, వాటి నుంచి వసూలు చేసిన చెత్త ఛార్జీలు, బకాయిల వివరాలను పొందుపరిచాలి. వార్డు కార్యదర్శులు వసూలు చేసిన నిధుల వివరాలు కచ్చితంగా అందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వెంటనే ఆ డబ్బును జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో జమ చేయాల్సి ఉంటుంది. కొందరు గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో వసూలు చేసిన మొత్తాన్ని కొంత భాగమే సౌకర్యంలో చెల్లించి, మిగతా మొత్తాన్ని తమ వద్ద ఉంచుకున్నారు.

- ఇటీవల జోన్-8లో వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శుల యాప్‌ను పరిశీలించగా రూ.25 లక్షల వరకు చెత్త రుసుములు వారి వద్ద ఉండిపోగా, రూ.32 లక్షలు జీవీఎంసీ సౌకర్యంలో చెల్లించినట్లు తేలింది. తక్షణమే మిగతా నిధులు జీవీఎంసీకి చెల్లించాలని కార్యదర్శులకు జెడ్సీ నోటీసులు జారీ చేశారు. మిగతా జోన్లలోని కార్యదర్శుల వద్ద ఉన్న డబ్బు కలిపితే ఈ మొత్తం రూ.3 కోట్ల వరకు ఉండే అవకాశాలున్నాయి. కొన్ని వార్డుల్లోని కార్యదర్శులు మాత్రం వసూలు చేసిన మొత్తాన్నంతటినీ సౌకర్యం కేంద్రంలో చెల్లించేశారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ప్రజల నుంచి వసూలు చేసిన చెత్త సేకరణ రుసుములు కార్యదర్శులంతా చెల్లించారా లేదా అన్న అంశంపై విచారణ చేపడతాం. సహాయ వైద్యాధికారులు, జెడ్సీలను అప్రమత్తం చేసి కార్యదర్శుల వద్ద ఉండిపోయిన నిధులన్నీ జమయ్యేలా చూస్తాం. ప్రజల నుంచి వసూలు చేసిన వెంటనే జీవీఎంసీకి ఎందుకు చెల్లించలేదో వివరణ తీసుకుంటాం. సంతృప్తి చెందకపోతే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

అవినీతి పోలీసు సిబ్బందిపై వేటు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: అవినీతికి పాల్పడి, అధికార దుర్వినియోగం చేసిన పోలీసు సిబ్బందిపై వేటు పడింది. ట్రాఫిక్ విభాగానికి చెందిన ఇద్దరు ఎస్.ఐ.లు, ఇద్దరు హోంగార్డులను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న బీచ్ రోడ్డు నోవాటెల్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ మహారాణిపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు చెందిన ఎం.ప్రసాద్, రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు చెందిన ట్రాఫిక్ ఎస్.ఐ. షేక్ నజరుద్దీన్‌లతో పాటు హోంగార్డులు వెంకట త్రినాథ్, సి.హెచ్.శివగణేష్ విధులు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్లు, రైడర్లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించడంతో పాటు అక్కడే ఒక ఆటో డ్రైవర్‌ను మధ్యవర్తిగా ఉంచి అక్రమంగా పలువురి నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడేవారు. దీనిపై ఫిర్యాదు అందడంతో పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సమగ్ర విచారణ చేపట్టారు. దీంతో వీరిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పోలీసుశాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా తమ విధులు నిర్వర్తించాలని, విధుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అధికార దుర్వినియోగం, అవినీతికి పాల్పడినా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పోలీసుశాఖలో ఎవరైనా లంచం అడిగినా, తీసుకున్నా వెంటనే 79950 95799 నెంబరుకు సమాచారమివ్వాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

ముగ్గురు సి.ఐ.లకు స్థానచలనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సి.ఐ.లకు స్థానచలనం చేశారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జి.దేముడుబాబు (పార్వతీపురం జిల్లా ఎస్.బి.)ను ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ (శాభ)కు, బి.భాస్కరరావు (ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ శాభ)ను మహారాణిపేట పోలీసుస్టేషన్ (శాభ)కి.. పి.శ్రీనివాసరావు (మహారాణిపేట పోలీసుస్టేషన్ శాభ)ను ఇంటిలిజెన్స్ విభాగానికి డిప్యుటేషన్ కోసం విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు.

జిల్లా అభివృద్ధిపై నేడు సమీక్ష

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న వివిధ పథకాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమీక్షలో జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. అదే విధంగా తెదేపా కార్యాలయంలో పార్టీ పరంగా జరిగే సమీక్షకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హాజరుకానున్నారు.

కేంద్ర కారాగారం డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కె.జవహర్‌బాబు కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జైల్ నుంచి బదిలీపై ఇక్కడకు రాగా.. ఇక్కడ పని చేసిన ఎస్.కమలాకర్ కడపకు వెళ్లారు. జైళ్ల శాఖ ఆదేశాల మేరకు అటాచ్‌మెంట్ పద్ధతిలో ఈ బదిలీలు జరిగాయన్నారు.


కె.జవహర్‌బాబు

అంచనాలకు మించి మద్యం ఆదాయం



రెండేళ్లలో సుమారుగా రూ.514 కోట్లు

అంచనాలకు మించి ఆదాయం

మాధవధార, న్యూస్‌టుడే

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఈ నెల 16 నుంచి తెరుచుకున్నాయి. లాటరీలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులంతా దాదాపు దుకాణాలను తెరిచి విక్రయాలు ప్రారంభించారు. దరఖాస్తులు, మొదటి విడత చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజుల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 331 మద్యం దుకాణాలకు సంబంధించి మొదటి విడత లైసెన్సు ఫీజుల కింద రూ. 40.48కోట్లు చెల్లించారు. విశాఖ జిల్లాలో 155 దుకాణాలకు రూ. 21.46 కోట్లు, అనకాపల్లి జిల్లాలో రూ. 14.5 కోట్లు, అల్లూరి జిల్లాకు రూ3. 9కోట్లకు పైగా వసూలైంది.


బిర్లా జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణం

ఉమ్మడి విశాఖ జిల్లాలో అంచనాలకు మించి ఆదాయం వచ్చింది. విశాఖలో 155 దుకాణాలకు 4139, అనకాపల్లి జిల్లాలో 136 దుకాణాలకు 3291, అల్లూరి జిల్లాలో 40 దుకాణాలకు 1205 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 331 దుకాణాలకు సంబంధించి 8635 దరఖాస్తుల ద్వారా రూ. 172.70 కోట్ల ఆదాయం సమకూరింది. రెండో ఏడాది పది శాతం లైసెన్సుల ఫీజులు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈవిధంగా రెండేళ్లలో సుమారుగా రూ. 514 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమ కానున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్సైజ్ పన్ను వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	దుకాణాలు	మొదటి విడత చెల్లించినది	తొలి ఏడాది	రెండో ఏడాది
విశాఖ	155	21.46	131.75	141.5
అనకాపల్లి	136	14.5	88.4	99
అల్లూరి	40	3.98	22.0	32.0

ఉచితంగా సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయ్యింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్ర హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్యసేవ, మహేష్‌బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్ర హాస్పిటల్స్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాబోయే రోజుల్లో ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ఈ శిబిరం నిర్వహిస్తాం' అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పద్వాళ్వార్, శరన్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, పాల్గొన్న వైద్య నిపుణులు

వైద్య విద్యార్థినుల భద్రతకు పెద్దపీట

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల మహిళా వసతిగృహాన్ని గురువారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. వైద్య విద్యార్థినులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినుల కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వసతిగృహంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పారు. విశాఖ నగరంలో ఎక్కడా రౌడీషీటర్ లేకుండా చేయాల్సి ఉందన్నారు. ఏ నేర ఘటన జరిగినా నిందితులను 24 గంటల్లోనే పట్టుకుంటున్న పోలీసుల పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పోలీసులు తప్పనిసరి పరిస్థితుల్లో పని చేశారని, ఇప్పుడు బాధ్యతగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు పాల్గొన్నారు.


వసతిగృహంలో హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్, పోలీస్‌కమిషనర్

గీతంలో అంతర్జాతీయ సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీలో గురువారం నుంచి చేపట్టిన అంతర్జాతీయ సదస్సును విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు, భద్రత అంశాలపై గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (దిల్లీ) సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ (తైవాన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఎంపీ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. బలమైన దేశాలు ప్రపంచశాంతి, అభివృద్ధి కోసం ఆలోచించడం మరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (దిల్లీ) వీసీ ఆచార్య శాంతిశ్రీ ధూలిపూడి పండిట్, గీతం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు కూడా మాట్లాడారు. సదస్సు నిర్వాహక సంస్థల ప్రతినిధులు, ఆచార్యులు రాబర్ట్‌హిష్, అల్కా ఆచార్య, ఎస్.సుష్మరాజ్, డాక్టర్ ఎం.వి.కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

డోలీ మోతలు నివారించాలని ధర్నా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో డోలీ మోతలు నివారించాలని పలువురు గిరిజనులు గురువారం జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీవీటీజీ గిరిజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి, విద్యుత్తు సదుపాయం కల్పించాలన్నారు. కొయ్యూరు మండల పరిధి మూలపేట, రేలుగుంట మండల పరిధి పొత్తగెడ్డ, నీలబంద, కన్నకుంట మీదుగా రహదారి ఏర్పాటుకు ఉపాధి నిధులు రూ. కోటి నిధులు చేశారని, పనులు మాత్రం పూర్తి కాలేదని వాపోయారు. అనంతగిరి మండల పరిధిలోనూ ఇటువంటి పరిస్థితి ఉన్నాయని వాపోయారు. జడ్పీ సాధారణ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి పరిష్కారం కనుగొనాలని కోరారు. సంఘం నాయకులు కె.వెంకటరావు, చిన్నారావు, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజనులు మంత్రి అనితను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.


జడ్పీ కార్యాలయం వద్ద డోలీలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

26 నుంచి ఆంధ్ర-హిమాచల్‌ప్రదేశ్ రంజీ మ్యాచ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఈనెల 26వ తేదీ నుంచి ఆంధ్ర-హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ జరగనుందని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. నాలుగు రోజులపాటు ఈ మ్యాచ్ జరుగుతుందన్నారు. ఆంధ్ర జట్టుకుఎస్.కె.రషీద్, హిమాచల్‌ప్రదేశ్ జట్టుకు రిషి ధావన్ కెప్టెన్లుగా వ్యవహరిస్తారని చెప్పారు.

★ ఆంధ్ర జట్టు సభ్యులు వీరే: ఎస్.కె.రషీద్(కెప్టెన్), టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హెచ్.విహారి, కె.మహీప్ కుమార్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్‌రెడ్డి, కె.వి.శశికాంత్, అశ్విన్‌హెబ్బర్, సిహెచ్.స్టీఫెన్, పి.సత్యనారాయణరాజు, ఎ.లలిత్‌మోహన్, జి.మనీష్, ఎం.హేమంత్‌రెడ్డి, ఎస్.ఎం.డి.రఫీ, కె.కరణ్ షిండే.


ఎస్.కె.రషీద్, కెప్టెన్, ఆంధ్ర జట్టు

పెరుగుతున్న ములాఖత్ దరఖాస్తులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారం గేటు వద్ద గురువారం సుమారు 90 మంది ములాఖత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు నిర్ణీత సమయంలో వచ్చిన వారందరికీ ఖైదీలను కలుసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జైలు అధికారులు పేర్కొన్నారు. ఈ మధ్య రౌడీ షీటర్లు గంజాయి కేసుల్లో ఇరుక్కొని రిమాండ్ ఖైదీలుగా వస్తున్నారని.. ఆ కారణంగా ములాఖత్ దరఖాస్తులు పెరుగుతున్నాయని వెల్లడించారు.


జైలు గేటు వద్ద ములాఖత్ దరఖాస్తు కోసం నిల్చొన్న దృశ్యం

హనీట్రాప్ కేసులో జాయ్ జెమీయా విచారణ

మాధవధార, న్యూస్‌టుడే: హనీట్రాప్ కేసులో జైలో ఉన్న నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీయాను విచారణ నిమిత్తం గురువారం కంచరపాలెం పోలీసులు మూడు రోజులపాటు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో ఆమెతో పాటు ఓ అటవీ శాఖ అధికారి కూడా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, మరిన్ని వివరాలు సేకరించేందుకు కస్టడీకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ ముఠా ప్రమేయం ఉందని, వారే ట్రాప్ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ ముఠాలో ఎంత మంది ఉన్నారు, ఎవరెవరిని ట్రాప్ చేసి ఎంత నగదు దోచుకున్నారో తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్టు, భీమిలి పోలీస్‌స్టేషన్లలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెమీయాపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయా స్టేషన్ల అధికారులు కూడా వచ్చి విచారిస్తున్నారు. మూడు రోజులపాటు కస్టడీకి ఇచ్చారని, విచారణ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలను మోసగించిన చీటీల నిర్వాహకుల అరెస్టు

రూ.1.19 కోట్ల నగదు సీజ్

తగరపువలస, న్యూస్‌టుడే: లక్కీడ్రా, తదితర స్కీంల పేరిట భారీగా నగదు వసూలు చేసి ప్రజలను మోసగించిన తగరపువలస సత్యనారాయణపేటకు చెందిన చీటీల నిర్వాహకులు వంగపండు రోజా (43), ఆమె భర్త శ్రీనివాసరావు(50)లను గురువారం అరెస్టు చేసినట్లు భీమిలి పోలీసులు తెలిపారు. చిప్పాడ గ్రామానికి చెందిన కొంతమంది బాధితుల ఫిర్యాదు మేరకు ప్రాథమికంగా విచారణ చేపట్టి వీరిని అరెస్టు చేశామన్నారు. మూడేళ్ల నుంచి చిప్పాడ, పరిసర గ్రామాలకు చెందిన వారికి మాయమాటలు చెప్పి నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ. 1.19 కోట్లు వీరు వసూలు చేశారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచాక అడివివరం కేంద్ర కారాగారానికి పంపినట్లు వారు పేర్కొన్నారు. వీరి మోసానికి గురైన పలువురు బాధితులు ఇప్పటికే పోలీసులను ఆశ్రయించగా గురువారం మరో 20 మంది ఫిర్యాదు చేశారు.


శ్రీనివాసరావు, రోజా

విశాఖలో 'సింబెక్స్-2024' విన్యాసాలు ప్రారంభం

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే : తూర్పు నౌకాదళం ముఖ్య కార్యాలయం విశాఖపట్నం కేంద్రంగా భారత్-సింగపూర్ దేశాల మధ్య 'సింబెక్స్-2024' మారిటైం ద్వైపాక్షిక విన్యాసాలు 23న ప్రారంభమైనట్టు గురువారం నేవీ వర్గాలు తెలిపాయి. తొలిసారి 'ఎక్సర్‌సైజ్ లైన్ కింగ్' పేరిట 1994లో భారత నౌకాదళం, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్(ఆర్ఎస్ఎన్) నౌకాదళం మధ్య సముద్ర విన్యాసాలకు శ్రీకారం చుట్టారు. 25 వరకు హార్బర్ ఫేజ్‌లో, 28, 29 తేదీల్లో సీ-ఫేజ్‌లో విన్యాసాలు జరుగుతాయి. సింగపూర్‌కు చెందిన 'ఆర్ఎస్ఎస్ టినాసియస్', భారత్ నేవీకి చెందిన 'ఐఎన్ఎస్ శివాలిక్' యుద్ధనౌకలు భాగస్వామ్యమవుతున్నట్టు పేర్కొన్నాయి. విన్యాసాల ప్రారంభ కార్యక్రమంలో ఇరు దేశాల నేవీ అధికారులు పాల్గొన్నారని స్పష్టం చేశాయి.


సాగర జలాలపై సింగపూర్ యుద్ధనౌక


నేవల్‌డాక్‌యార్డుకు చేరిన నౌక

యువకుడిపై హత్యాయత్నం

★ బాధితుడు పలు చోరీ కేసుల్లో నిందితుడు

★ దాడికి పాల్పడిన వారి కోసం గాలిస్తున్న పోలీసులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఓ యువకుడిపై హత్యాయత్నం ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా.. పాత డెయిరీఫాం సమీప గాంధీనగర్‌కు చెందిన జామి వెంకటనవీన్(20) ఇంటర్ వరకు చదివాడు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో బీచ్‌రోడ్డుకు వచ్చాడు. ఆ సమయంలో రామానాయుడు స్టూడియో సమీపంలోని మరిడిమాంబ ఆలయం ఎదురుగా కొందరు అతడి తలపై బలంగా కొట్టి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

★ తర్వాత ఏసీపీ ఎస్.అప్పలరాజు కూడా ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకునే చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురు అనుమానితులను స్టేషన్‌కు రప్పించి విచారణ చేస్తున్నారు. గాయపడిన వెంకటనవీన్ పలు చోరీ కేసుల్లో నిందితుడుగా పోలీసులు గుర్తించారు. బాధితుడు తనను గాయపర్చిన వారి వివరాలు చెప్పనందున అందరూ కలిసి ఏదైనా చోరీకి వచ్చిన క్రమంలో ఈ ఘటన జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.


తీవ్ర గాయాలతో వెంకటనవీన్

పెట్రోల్ పోసి హత్యాయత్నం

గురుద్వారా, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధంలో విభేదాల కారణంగా ఓ మహిళ వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం సీతంపేటలో కలకలం రేపింది. ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సీతంపేటకు చెందిన సురేంద్రగుప్తా (72), ఓ మహిళ (54) మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆమె క్యాన్సర్ బారిన పడడంతో గుప్తా పట్టించుకోవడం మానేశారు. దీంతో గురువారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపంతో ఆమె గుప్తాపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడ్ని హుటాహుటీన ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఆమె ఈనెల 23వ తేదీ ఉదయం ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరి వెళ్లింది. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెదికినా ఆచూకీ లభించ లేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - (మార్నింగ్, మ్యాట్నీ), దేవర (ఫస్ట్, సెకెండ్ షో) స్క్రీన్-2- విశ్వం

పెందుర్తి

నేటి నుంచి పశు గణన

పెందుర్తి, న్యూస్‌టుడే: అఖిల భారత 21వ పశు గణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు పెందుర్తి మండలంలో పశు గణన నిర్వహించనున్నట్లు పెందుర్తి పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు తెలిపారు. పశు వైద్య సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పశుజాతుల సంఖ్యను నమోదు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో పశువులకు సంబంధించిన వివిధ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు పశు గణన ప్రామాణికమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పశువులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు.

– న్యూస్‌టుడే, చినముషిడివాడ(పెందుర్తి)

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ ప్రశాంతినగర్‌లో 74బి/1, సత్యానగర్‌లోని 10ఎ/11 స్తంభాలకు ఉన్న వీధి దీపాలు చాలా రోజులుగా వెలగడం లేదు. కాలనీల్లో రాత్రివేళ చీకట్లో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు.

– తులసి, ప్రశాంతినగర్, గోగుల జగన్నాథరావు, సత్యానగర్

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– శివరామ్ ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిక్కవానిపాలెం, దళాయిపాలెం, ఊటగెడ్డపాలెం తదితర గ్రామాలకు సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం తెలిపారు. అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు, గొట్టివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని వెల్లడించారు.

దారంతా గుంతలు.. అంతులేని అవస్థలు


ఎన్ఏడీ లేఅవుట్ వాటర్ ట్యాంకు రోడ్డులో గుంతలు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు కోసం సక్రమంగా ఉన్నవి ధ్వంసం చేసి వాటిని సకాలంలో పునర్నిర్మించకపోతే వచ్చే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. భూగర్భ మురుగు నీటి(యూజీడీ) పైపులైన్ల ఏర్పాటు కోసం రోడ్లను తవ్వి వాటిని సకాలంలో పూడ్చకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని లక్ష్మీనరసయ్యమ్మ నగర్, ఎన్ఏడీ లేఅవుట్‌లోని రోడ్లు దయనీయంగా మారాయి. గుంతలు పడి రాళ్లు తేలి ప్రయాణం నరకంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూజీడీ పనులు ముగిసినా..

ఈ కాలనీల్లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు గతంలో చేపట్టారు. గొట్టాల కోసం రోడ్డు మధ్యలో గోతులు తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత కాంక్రీటుతో గోతులుపూడ్చారు. కానీ, రోడ్లకు పూర్తిస్థాయి మరమ్మతు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. యూజీడీ కోసం బాగున్న రోడ్లను తవ్వేశారు. పనులు ముగిసిన తర్వాత మరమ్మతులు మాత్రమే చేసి మమ అనిపించేశారు.

నూతన రహదారులు నిర్మించాలి

యూజీడీ పనుల కారణంగా ధ్వంసమైన రోడ్లను నూతనంగా నిర్మించాలని లక్ష్మీనరసయ్యమ్మనగర్, ఎన్ఏడీ లేఅవుట్ వాసులు కోరుతున్నారు. వర్షం కురిస్తే రోడ్లపై గోతులన్నీ నీటితో నిండిపోయి ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. పలుచోట్ల రోడ్డుపై కంకర తేలి జారి పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.


లక్ష్మీనరసయ్యమ్మ కాలనీలో మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన రహదారి


కాలనీలో ఏ రోడ్డు చూసినా ఇదే దుస్థితి..

అఖిల భారత క్రీడల్లో ఎన్టీపీసీ విద్యార్థినుల సత్తా

పరవాడ, న్యూస్‌టుడే: ఛైల్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో దిల్లీలో ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహించిన 15వ అఖిల భారత ఇంటర్ యూనిట్ స్పోర్ట్స్ మీట్-2024 పోటీల్లో పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు సత్తాచాటారు. అథ్లెటిక్ బాలికల విభాగంలో ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.సంధ్యారాణి 400, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, 1500 మీటర్ల పరుగులో రజతం సాధించింది. సాయిరాగిని, డింపుల్ లక్ష్మి, శరణ్యారెడ్డి, బి.సంధ్యారాణి రిలే పరుగులో రజత పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలతో పాటు పీడీ షెల్టన్ జేమ్స్‌ను ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అభినందించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాతో పతకాలు సాధించిన విద్యార్థినులు

పాలసేకరణ ధర పెంచాలని ఆందోళన

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధరను తగ్గించి పాడిరైతుల ఆదాయాలకు గండికొట్టడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. దీనికి నిరసనగా గురువారం పరవాడలోని విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం వద్ద రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే పశువుల దాణా ధర పెరిగిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే పాలసేకరణ ధర తగ్గించి భారం మోపడం అన్యాయమన్నారు. ధరను వెంటనే పెంచకపోతే ఈనెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. పాడిరైతులకు ఇవ్వాల్సిన బోనస్‌లు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కె.రామసూరి అప్పారావు, కృష్ణ, పోతల శంకర్రావు, అప్పలనాయుడు, నాయుడు, నాగేశ్వరరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


పరవాడ డెయిరీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వార్డు మారినా పేరు మారలే..!

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సచివాలయాల భవనాలపై వార్డు పేర్లను మార్చడానికి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం జీవీఎంసీ 55వ వార్డు పరిధిలో ఉండేది. 4 ఏళ్ల క్రితం వార్డుల పునర్విభజనలో భాగంగా 55వ వార్డును 77వ వార్డుగా మార్చారు. అయితే ఇప్పటికీ వార్డులోని నమ్మిదొడ్డి కూడలి, కె.ఎన్.పాలెం, గొల్లపేట, పెదపాలెంలోని నాలుగు సచివాలయ భవనాలపైన 55వ వార్డుగా పేర్లు రాసి ఉన్నాయి. వార్డు పేరు మారి నాలుగేళ్లయినా భవనాలపైన 55వ వార్డు అని రాసి ఉండటంతో వివిధ పనుల నిమిత్తం వచ్చేవారంతా అయోమయానికి గురవుతున్నారు. సచివాలయ భవనాలపై వార్డు పేర్లు మార్చాలని సచివాలయ సిబ్బందికి ఇంకెంత సమయం పడుతుందో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.



పెద్దపాలెం సచివాలయం వద్ద 55వ వార్డుగా రాసి ఉన్న దృశ్యం



గొల్లపేట(పలికిలిదొడ్డి) సచివాలయం వద్ద..

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. పరవాడ మండలం కన్నూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని భూ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ భూములు, గెడ్డవాగుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. సదస్సులో మొత్తం 47 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కృష్ణవేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్

సబ్బవరం(పరవాడ) న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గాలిభీమవరంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ చిన్నికృష్ణ పాల్గొని మాట్లాడారు. రైతులు నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్లె రాజేశ్, రెవెన్యూ అధికారులు గణేశ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం దరి బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానంపై కార్యశాల నిర్వహించారు. స్పిరిచ్యువల్ టాబ్లెట్ వ్యవస్థాపకుడు డాక్టర్ పీఎస్.గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ధ్యానంతో ఆరోగ్యంపై సాధకులకు అవగాహన కల్పించారు. ప్రాపంచిక, ఆధ్యాత్మిక జీవిత విధానాలను వివరించారు. ఆయా పద్ధతులు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.



సదస్సులో పాల్గొన్న సాధకులు, సూచనలిస్తున్న గోపాలకృష్ణ

నేడు అప్రెంటీస్ మేళా

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి మంత్రిపాలెం హైటెక్ ఐటీఐలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ అక్కిరెడ్డి దుర్గినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్ సిస్టం కంపెనీ యాజమాన్యం ముఖాముఖి నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఫిట్టర్ 100, పెయింటర్ 40, మెషినిస్టు 30 మందిని ఎంపిక చేస్తారన్నారు. మేళాకు హాజరయ్యేవారంతా బయోడేటాతో పాటు విద్యా అర్హత ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

పెందుర్తి మండల పరిషత్ సమావేశం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ మధుపాడ నాగమణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

మద్యం గొలుసు దుకాణంపై పోలీసుల దాడి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడి చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది గవర జగ్గయ్యపాలెంలోని ఓ కిల్లీ బడ్డీపై దాడి చేసి 130 మద్యం, బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నాళ్లుగా కె.వెంకటరావు(35) అనే వ్యక్తి కిల్లీ బడ్డీలో గొలుసు దుకాణం నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అక్రమ నిర్మాణాల ఫిర్యాదులపై పట్టించుకోరా..?

జెర్రిపోతులపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చినా వైకాపా నాయకుల భూకబ్జాలు ఆగడం లేదు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జెర్రిపోతులపాలెం సర్పంచి మడక అప్పలరాజు ఆరోపించారు. గడచిన ఐదేళ్లలో వైకాపా నాయకుల ఇష్టానుసారంగా భూకబ్జాలు, జగనన్న కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినట్టు స్థానిక సచివాలయం కార్యదర్శి విచారణలో తేలినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని సర్పంచి మడక అప్పలరాజు ఆరోపించారు. గ్రామంలోని ప్రధాన రహదారికి పక్కనే వైకాపా నాయకుడు దర్జాగా రెండు అంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నాడని బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


జెర్రిపోతులపాలెంలో అక్రమ నిర్మాణం

రామచంద్రుడి సన్నిధిలో వైభవంగా హవనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రుడు ఆవిర్భవించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో గురువారం శ్రీరామ షడక్షరీ హవనం సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చకులు సీతారాములను ఆలయ ఉత్సవ మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి హవనం నిర్వహించారు. సంక్షేప రామాయణం పారాయణం చేశారు. శ్రీరామ పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. పూర్ణాహుతి నిర్వహించి పుణ్యాహవాచనం జలాలను ఆలయ ప్రదక్షిణ పూర్వకంగా స్వామికి సమర్పించి ప్రోక్షణ చేశారు. భక్తులు పాల్గొని సీతారాములను సేవించారు.


అలంకరణలో సీతారామ లక్ష్మణులు

భర్త వేధింపులు తాళలేక మహిళ మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లో నివాసముంటున్న టంకాల సునీత (32) సబ్బవరం పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రవణ్‌కుమార్‌తో 2018లో పెద్దల సమక్షంలో వివాహమైంది. నాటి నుంచి పుట్టింటికి వెళ్లి డబ్బులు తేవాలని భర్త డిమాండు చేసేవాడు. తరచూ వేధించడంతో గత కొంతకాలంగా ఆమె రామ్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. అయినా ఫోన్లో లేదా ఇక్కడికి వచ్చి డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యానికి పాలైంది. దీంతో ఇటీవల రామ్‌నగర్‌లోని ఓ కార్పొరేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడు వేధింపులే కారణమని మృతురాలి తండ్రి కాళేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ రమణయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

రహదారిపై నూనె.. తప్పిన ప్రమాదం

వేపగుంట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి తీసుకెళ్తున్న నూనె డబ్బా బీఆర్టీఎస్ వేపగుంట సిగ్నల్ వద్ద కింద పడి అందులోని నూనెంతా రోడ్డుపై ఒలకడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడ్డారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు వెంటనే స్పందించి ఇసుకను తెప్పించి నూనెపై చల్లించారు. నెమ్మదిగా ప్రయాణించాలని వాహనదారులను సూచించారు. పలువురు వాహనదారులు, స్థానికులు కానిస్టేబుల్‌ను అభినందించారు.


నూనెపై ఇసుక వేసిన కానిస్టేబుల్ శ్రీనివాసరావు

రుతుక్రమ సమస్యలపై అవగాహన



సైకాలజిస్టు లావణ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

పెందుర్తి, న్యూస్‌టుడే: యువతులు రుతుక్రమంలో శుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సైకాలజిస్టు నీలం లావణ్య సూచించారు. రుతు పరిశుభ్రత, ఆరోగ్యంపై గురువారం పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఫ్లోరా, కార్యదర్శి టి.థియోఫిలస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లావణ్య పాల్గొని విద్యార్థినులకు రుతు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. హార్మోన్ల అసమతుల్యత వల్ల కలిగే మానసిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మళ్ల విజయ, అరుణ, గణేశ్, ఎన్ఎస్ఎస్ పీవోలు మంజుల, ఎన్.సంధ్యారాణి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గాజువాక, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి, తప్పించుకుని తిరుగుతున్న నలుగురు నిందితుల్ని గురువారం క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... శ్రీహరిపురానికి చెందిన భార్గవనాయుడు గత నెల 30న గాజువాక నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో మల్కాపురం, శ్రీహరిపురానికి చెందిన పాత నేరస్థులు ఎన్.మహేశ్‌నాథ్(19), కె. భానుప్రకాశ్(24) స్కూటీని అడ్డగించి బలవంతంగా వెనక సీట్లో కూర్చున్నారు. జింక్ గేటు పక్క నుంచి మింది దారిలోకి తీసుకెళ్లమని ఒత్తిడి చేశారు. ఆటువైపు వెళ్లిన తర్వాత భార్గవనాయుడుని కిందకు తోసేసి స్కూటీతో పరారయ్యారు. అప్పట్లోనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు నిందితులు మహేశ్‌నాథ్, భానుప్రకాశ్‌ను అరెస్టు చేసి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

★ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న అగనంపూడి ప్రాంతానికి చెందిన వెంకటలక్ష్మి (33) ఈనెల 17న స్థానిక బస్‌స్టాపు వద్ద నిరీక్షిస్తున్నారు. ఆ సమయంలో గంగవరానికి చెందిన జి.సూర్యనారాయణ(22), ముత్యాలమ్మపాలెం నివాసి కె. కోదండరావు(26) వెనక నుంచి బైక్‌పై వచ్చి ఆమె చేతిలో బ్యాగ్ లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు నిందితులను అరెస్టు చేసి, వెంకటలక్ష్మికి చెందిన చరవాణి, ఇతర సామగ్రితో పాటు, మరో కేసుకు సంబంధించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితుల్ని రిమాండుకు తరలించారు.

శోభాయమానం స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు.

రహదారులే క్రీడా ప్రాంగణాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: యువకులు క్రీడల్లో రాణించి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ప్రసంగాల్లో చెప్పే పాలకులు, అధికారులు వసతులు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. యువకులు ఆటలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు నిర్మించడంపై మాత్రం దృష్టిసారించడం లేదు. గత్యంతరం లేక రహదారులనే క్రీడా ప్రాంగణాలుగా మలచుకుని వారికి నచ్చిన ఆటలు ఆడుకుంటున్నారు. సుజాతనగర్ నుంచి ఆర్ఆర్‌వెంకటాపురం వరకు బీఆర్టీఎస్ రహదారిపై తెల్లవారుజాము నుంచి ఉదయం 6 గంటలలోపు బాలలు స్కేటింగ్ ఆడుతున్నారు. ఆ తర్వాత ఆడుకుందామన్నా వీలులేకపోవడంతో నిరాసతో వెనుదిరుగుతున్నారు. ప్రమాదమని తెలిసినా మరోదారి లేక రహదారి మధ్యలో ఆటలు ఆడుతున్నామని బాలలు చెబుతున్నారు.

ఎక్కువగా ఈ ప్రాంతాల్లో..: నాయుడుతోట, ఆర్ఆర్ వెంకటాపురం పవర్‌స్టేషన్, సుజాతనగర్, అప్పన్నపాలెంలో స్కేటింగ్ ఆడుతున్న బాలలు ఎక్కువగా ఉన్నారు. వీరంతా రోజూ తర్ఫీదు పొందేందుకు స్థానికంగా ఎటువంటి సదుపాయాలు గానీ, క్రీడా ప్రాంగణాలు గానీ లేకపోవడంతో ఉదయం బీఆర్టీఎస్ రహదారిపై ఆడుతున్నారు. వీరితో పాటు వాకర్స్, సైక్లింగ్ చేసేవారు బీఆర్టీఎస్‌నే ఎంచుకుంటున్నారు. వేపగుంట పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో కూడా క్రీడా వసతులు అంతంతమాత్రంగానే ఉండటంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఆటలు ఆడుకునే పరిస్థితి లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న పెందుర్తి నియోజకవర్గంలోని యువకులు క్రీడల్లో రాణించడానికి అవసరమైన క్రీడా ప్రాంగణాలు, వసతుల కల్పనకు పాలకులు, అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నాయుడుతోట బీఆర్టీఎస్ రహదారిలో స్కేటింగ్ చేస్తున్న బాలలు

పగటి వెలుగులకు అడ్డుకట్ట పడేదెప్పుడో..!

జీవీఎంసీలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పలుచోట్ల రాత్రుళ్లు దీపాలు వెలగడం లేదు.. మరికొన్ని చోట్ల పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో గత కొద్దిరోజులుగా పట్టపగలే దీపాలు వెలుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తును ఆదా చేయాల్సిన అధికారులు వృథా చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులను అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పరవాడ



పొదలమాటున ప్రమాదకర ప్రయాణం..


తానాం - భరణికం రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పరవాడ, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా పెద్దఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పరవాడ మండలంలోని భరణికం - తానాం, పరవాడ - తానాం, భరణికం - పరవాడ, జాజులవానిపాలెం - పి.భోనంగి - కలపాక, వాడచీపురుపల్లి - వెంకటాపురం, రేఖవానిపాలెం - గొల్లగుంట, పెదముషిడివాడ - విజయరాంపురం గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పలుచోట్ల చెట్లు కొమ్మలు రహదారిపైకి చొచ్చుకురావడంతో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకోవడానికి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. భారీ వాహనాల ప్రయాణించే సమయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు బాగా పెరిగిపోవడంతో మలుపులు వద్ద వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కానరావడం లేదని ఆందోళన చెందుతున్నారు. రహదారుల్లో సరిగా విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో చీకటి కమ్మేయడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రేఖవానిపాలెం - గొల్లగుంట రోడ్డులో..

భీమిలి

సినిమాలు
విశ్వతేజ(జగదాంబ), న్యూస్‌టుడే
గోకుల్ - వెనమ్: ది లాస్ట్ డాన్స్
రామలక్ష్మి - దేవర
లీలా - లగ్గం
సప్తగిరి - విశ్వం, వేట్టయ్యన్ (తెలుగు) - వేట్టయన్ ది హంటర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ కె.కె.చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఆయా సమయాల్లో ఎండాడ, బీచ్, ఎస్సీ కాలనీ, రాజీవ్‌నగర్, శ్రీనివాసనగర్, గొల్లల ఎండాడ, సందీప్‌నగర్, దుర్గానగర్, వరాహగిరినగర్, శాంతినగర్, ఎండాడ రామాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: రుషికొండ-నార్త్ కళాశాల రోడ్డులో కాలిబాటలు ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. -రవి, రుషికొండ
సమాధానం: క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. -సింహాచలం, జోన్-2 టీపీవో

సమస్య: శిరుపగిరినగర్(ఎండాడ) నుంచి ఎండాడ పెట్రోల్ బంకు వెళ్లే దారి గతుకులమయంగా ఉంది. -హరిక్రిష్ణ, ఎండాడ
సమాధానం: త్వరలో తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -సురేష్, ఏఈ

సమస్య: ఎండాడ కూడలిలో పైప్‌లైన్ నిమిత్తం తవ్విన గోతులు పూడ్చకపోవడంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. -జానకిరామ్, ప్రయాణికుడు
సమాధానం: గోతులు పూడ్చి సమస్య పరిష్కరిస్తాం. -సురేష్, మంచినీటి విభాగం ఏఈ

సీహెచ్‌సీలో నేత్ర పరీక్షల సేవలకు మంగళం



కంటి రోగులకు తప్పని ఇబ్బందులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో నెలకొల్పిన ముఖ్యమంత్రి ఎల్వీప్రసాద్ ఐ కేంద్రాన్ని ఎత్తివేయడంతో 'దృష్టి'కి సంబంధించి చేసే పరీక్షలు నిలిచిపోయాయి. 2018 ఫిబ్రవరి ఒకటో తేదీన తెదేపా ప్రభుత్వం సీహెచ్‌సీల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అపోలో సంస్థ తోడ్పాటుతో ఆస్పత్రికి వచ్చే రోగులకు కంటి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించేవారు. ప్రభుత్వం అపోలో సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం గడువు తాజాగా ముగియడంతో దీన్ని ఎత్తివేశారు. ప్రస్తుతం ఈ సేవలు అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

సేవలు అందిన తీరుతెన్నులు!



దృష్టి లోపాన్ని పరీక్షించే ఆటో రిఫ్రాక్టోమీటర్

కంటి సమస్యతో వచ్చే వారికి ఈ కేంద్రంలో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్ రోగుల ఆధార్ తదితర వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసేవారు. తర్వాత ఆప్తమాలజీ సహాయకుడు ఫండస్ కెమెరా ద్వారా రెటీనా తదితర పరీక్షలు చేసేవారు. ఆటో రిఫ్రాక్టోమీటర్‌తో దృష్టి లోపాన్ని పరీక్షించేవారు. తర్వాత వారిని రోజూ వీడియో కాల్ ద్వారా వైద్యులు పరీక్షించి అవసరమైన రోగులకు కంటి అద్దాలు అందించేవారు. ఆపరేషన్ చేయాల్సి ఉన్నట్లయితే విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి పంపించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు తోడ్పాటు అందించేవారు. అపోలో సంస్థ కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం పొడిగించక పోవడంతో ఈ కేంద్రాన్ని మూసివేసి సంబంధిత వైద్య పరికరాలను కూడా తరలించారు. దాంతో ఈ కేంద్రంలో పనిచేసే ఇద్దరు సిబ్బంది ఉపాధి కోల్పోవాల్సి వచ్చింది.



ఫండస్ కెమెరా

ఉమ్మడి విశాఖ జిల్లాలోని సీహెచ్‌సీల్లో గతంలో ఏర్పాటు చేసిన కేంద్రాల సమాచారం
- ★ భీమునిపట్నం
- ★ అగనంపూడి
- ★ పెందుర్తి
- ★ ఎలమంచిలి
- ★ చోడవరం
- ★ కె.కోటపాడు
- ★ అరకు
- ★ పాడేరు
- ★ నక్కపల్లి

మళ్లీ తెరిపిస్తే పేదలకు ఎంతో ప్రయోజనం

పేద వర్గాలకు ఉపయోగపడే ముఖ్యమంత్రి ఎల్వీప్రసాద్ ఐ కేంద్రాన్ని సీహెచ్‌సీలో మళ్లీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. భీమిలిలో ఉన్న ఈ కేంద్రానికి నియోజకవర్గంలోని పేదలు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. రోజుకు 30 నుంచి 40 మందికి పరీక్షలు నిర్వహించి ఉచిత సేవలు అందించేవారు. ప్రస్తుతం ఇది మూతపడడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యతో ప్రయివేటు కంటి వైద్యుని వద్దకు వెళితే కళ్లద్దాలతో కలుపుకొని రూ.1500 నుంచి రూ.2500 వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు. భీమిలి సీహెచ్‌సీ వైద్యపర్యవేక్షక అధికారి డాక్టర్ ఎం.పణికుమార్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా జిల్లాలోని అన్ని చోట్లా ఈ సేవలు నిలిచిపోయాయన్నారు. వీటిని పునరుద్ధరించాలని వినతులు వస్తున్నందున ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

పంచగ్రామాల భూసమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న అధికారులు గతంలో చోటు చేసుకున్న పూర్వాపరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పంచగ్రామాల కాలనీ అసోసియేషన్, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచగ్రామాల భూముల కమిటీ ప్రతినిధులు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కోరారు. గురువారం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావుతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సమస్యకు సంబంధించి గతంలో జరిగిన కమిటీల విచారణలు, న్యాయస్థానంలోని వ్యాజ్యాలు, సమస్య మూలాలను కలెక్టర్‌కు వివరించారు. కమిటీ ప్రతినిధులు బి.వి.కృష్ణంరాజు, బి.రమణి, ప్రతాప్, కృష్ణారావు, రాము, హనుమంతరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ గంగారావు తదితరులు

ముగిసిన ఉచిత వైద్య శిబిరాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: విశాఖలోని తూర్పు నౌకాదళానికి సంబంధించిన నౌసేనాబాగ్ సమీప పాఠశాల్లో జవహర్‌లాల్ నెహ్రూ డీమ్డ్ వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) నిర్వహించిన ఉచితవైద్య శిబిరాలు గురువారంతో ముగిశాయి. వైద్య బృందాల నిపుణులు దాదాపు మూడు వేల మంది బాలబాలికలకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపినట్లు జిమ్‌సర్ వైద్య వ్యవహారాల పర్యవేక్షకుడు డాక్టర్ బి.కార్తిక్ పేర్కొన్నారు. వీరి సేవలను తూర్పు నౌకాదళానికి చెందిన రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్‌రాజు కొనియాడారు. జిమ్‌సర్ ప్రొ-వీసీ డాక్టర్ బి.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిమ్‌సర్ వైద్య నిపుణులు

అ వీ ఇ వీ

● 'ఆస్తి పన్ను విధింపులో జాప్యమెందుకు'

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీలో ప్రజల ఆస్తులకు ఆస్తి పన్ను విధించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు కడుతున్న పన్నులతో అధ్యయనాల పేరుతో కార్పొరేటర్లు, అధికారులు విహారయాత్రలు చేయడం వల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. నిబంధనల పేరుతో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు, వారసత్వంగా వచ్చిన ఆస్తులకు ఇంటి పన్నులు వేయక పోవడం, తండ్రి పేరున ఉన్న ఆస్తిపన్నును కొడుకు పేరిట మార్చడం తదితరాలపై ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

● ఫుట్‌బాల్ జట్టుకు చేయూత

తగరపువలస, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా అండర్-14 ఫుట్‌బాల్ జట్టుకు భీమిలి ఎమ్మెల్యే సతీమణి గంటా శారద గురువారం చేయూతనందించారు. సమాజ సేవకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు జట్టులోని సభ్యులకు 'హెల్పింగు హ్యాండ్స్' తరఫున ఉచితంగా ఆమె క్రీడా దుస్తులు అందించారు.

● ముగిసిన మూల్యాంకనం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ టైపు రైటింగ్ పరీక్షలకు సంబంధించి ఇటీవల చేపట్టిన మూల్యాంకనం గురువారం సాయంత్రంతో ముగిసింది. భీమిలి పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18వ తేదీన ఈ ప్రక్రియ ప్రారంభమయ్యింది. డీసీసీపీ విభాగాధిపతి డా. జి.రాజేశ్వరి చీఫ్‌గా వ్యవహరించారు. టైపు అండ్ షార్ట్‌హ్యాండ్ విశాఖ జిల్లా అధ్యక్షులు వెంకటరావు, వివిధ టైపు ఇన్‌స్టిట్యూట్‌ల ప్రిన్సిపాళ్లు సహకరించారు. వచ్చే నెలాఖరులో ఫలితాలు విడుదల కానున్నాయని రాజేశ్వరి తెలిపారు.

● మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 9 మందికి ఆబ్కారీ విభాగం ప్రత్యేక న్యాయమూర్తి గురువారం జరిమానా విధించినట్లు ఎస్సై జి.ప్రసాద్ తెలిపారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90 వేలు అపరాధ రుసుం చెల్లించాలని తీర్పు వెలువరించారన్నారు.

శోభాయమానంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రామచంద్రుడి సన్నిధిలో వైభవంగా హవనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రుడు ఆవిర్భవించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో గురువారం శ్రీరామ షడక్షరీ హవనం సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చకులు సీతారాములను ఆలయ ఉత్సవ మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి హవనం నిర్వహించారు. సంక్షేప రామాయణం పారాయణం చేశారు. శ్రీరామ పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. పూర్ణాహుతి నిర్వహించి పుణ్యాహవాచనం జలాలను ఆలయ ప్రదక్షిణ పూర్వకంగా స్వామికి సమర్పించి ప్రోక్షణ చేశారు. భక్తులు పాల్గొని సీతారాములను సేవించారు.



పూజలందుకున్న సీతారామ లక్ష్మణులు

అప్పన్న సన్నిధిలో గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఆదర్శ ప్రేమిమండలి ఆధ్వర్యంలో భీమిలిలో గురువారం ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన బాలలకు మండలి ఛైర్మన్, విశ్రాంత ప్రిన్సిపల్ కాళ్ల సూర్య రామకృష్ణారావు బహుమతులు అందించారు. ★ తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలోనూ ఈ వేడుకలు నిర్వహించారు.

ఎండాడ, న్యూస్‌టుడే: స్థానిక ఎయిమ్స్ కళాశాలలోనూ ఈ వేడుకలు నిర్వహించారు. ఏయూ ప్రొఫెసర్ అర్జున ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. న్యాయవాది జేవీ ప్రభాకర్, ఎయిమ్స్ కళాశాల ఛైర్మన్ జంగాలయ్య, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి





ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ ప్రాంతంలోని రెండు పాఠశాలల్లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు మంచి స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఎస్.ఎస్.ఎస్. విద్యాలయంలో 8, 9, 10 తరగతులకు చెందిన పి.పవిత్ర(ప్రథమ), కె.కీర్తి(ద్వితీయ), ఎ.సాయికిరణ్ (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్‌ఎం ఎస్.సూర్యకళ, కరస్పాండెంట్ ఎస్.నాయుడు తదితరులు అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. ★ దసపల్లా లేఅవుట్ సెయింట్ జేమ్స్ పాఠశాల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు జి.శ్రావణి జస్మిత ప్రథమ, ఎన్.జగన్ ద్వితీయ, పి.ఉపేంద్ర తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరేరా తదితరులు అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్ఎస్ఎస్ పాఠశాల హెచ్ఎం సూర్యకళ, కరస్పాండెంట్ నాయుడు తదితరులు





విజేతలతో సెయింట్ జేమ్స్ పాఠశాల హెచ్ఎం పేరేరా తదితరులు

నేటి నుంచి పశుగణన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి పశుగణన పక్కాగా నిర్వహించాలని సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ అన్నారు. పాతడెయిరీ ఫారం కూడలిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నాలుగు నెలల పాటు దేశవ్యాప్తంగా పశుగణన జరుగుతుందని అందుకు నియమించిన సిబ్బంది ఒక దీక్షలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు విషయ సేకరణదారులకు, పర్యవేక్షకులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలా గణన నిర్వహించాలి, యాప్‌లో ఎలా నమోదు చేయాలి తదితర అంశాలు వివరించారు. ఇంటింటికి వెళ్లి పశుగణనకు ఉపయోగించే పత్రాలు, కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకులు సజ్జ శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్, రమణ పాల్గొన్నారు.

గణిత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు జాతీయ గణిత పరీక్షలో ప్రతిభ చాటినట్లు ప్రధానాచార్యులు ఆదినారాయణ, భానుగణేష్, గీతామాధురి తెలిపారు. ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎమ్) పరీక్షలకు 174 మంది హాజరు కాగా తర్వాత స్థాయికి 40మంది అర్హత సాధించారన్నారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏజీఎం ఎం.వి.సురేష్, ఆర్ఐ ప్రసాద్, జోనల్ కో-ఆర్డినేటర్ రాజేష్ తదితరులు విజేతలను అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

దడ పుట్టిస్తున్న నిత్యావసరాల ధరలు: సీపీఐ

కొమ్మాది, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరలు తగ్గించడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు పరిధి నగరంపాలెం, పోర్టు కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను చైతన్యపర్చారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే ప్రజలతో ఉద్యమిస్తామన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు బేగమ్, మధురవాడ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, సతీష్, చిన్నా, రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.



నగరంపాలెంలో చేపట్టిన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు యత్నం

పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: రోడ్డు పక్కనున్న ప్రభుత్వ స్థలం ఆక్రమించేందుకు ఇద్దరు వ్యక్తులు పోటీ పడుతున్నారు. దాదాపు రూ.కోటిన్నర విలువ చేసే సుమారు 300 గజాల భూమిని తమ వశం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వీరిలో ఒకరు పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. 8వ వార్డు స్వర్ణభారతినగర్(రుషికొండ) సుద్దగెడ్డ వంతెన సమీపంలో వంద అడుగుల రోడ్డుకు 30 అడుగుల దూరంలో ఓ వ్యక్తికి సొంత నివాసగృహం ఉంది. రోడ్డు పక్కనున్న కాలిబాటకు, సంబంధిత ఇంటికి మధ్యనున్న సుమారు 300 గజాల ఖాళీ స్థలం తనదంటూ వేరొక వ్యక్తి ఆ స్థలాన్ని స్వాధీన పర్చుకునేందుకు చదునుపనులు చేపట్టాడు. తన ఇంటికి ఎదురుగా ఉన్న భూమి తనకే చెందుతుందని, వేరొకరు ఆక్రమిస్తున్నారంటూ ఆ గృహ యజమాని పీఎంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేసి.. జేసీబీతో సంబంధిత స్థలంలో వేసిన మట్టిని తొలగించే చర్యలు చేపట్టాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ పనులను నిలిపివేశారు. దీనిపై స్థానిక వీఆర్వో జగదీష్ వివరణ కోరగా.. రోడ్డు పక్కనున్న సంబంధిత స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఈ వ్యవహారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

'ఓషనోగ్రఫీ' భవన నిర్మాణాలకు చదును పనులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ సమీప బేపార్కు కొండ దిగువ భాగంలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ భూముల్లో గురువారం నుంచి పొక్లెయిన్ సాయంతో చదును పనులు చేపడుతున్నారు. ఇక్కడ బీచ్‌రోడ్డుకు ఆనుకుని సముద్రతీరానికి ఎదురుగా కొండవాలు ప్రాంతంలోని మూడెకరాల ప్రభుత్వ భూములను సంబంధిత శాఖకు గతంలో రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఈ క్రమంలో ఆయాశాఖల కార్యకలాపాల నిర్వహణకు అనువుగా భవన నిర్మాణ పనుల నిమిత్తం గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2015వ సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి సుజనాచౌదరి ఈ పనులకు శంకుస్థాపన కూడా చేపట్టారు. తర్వాత వివిధ కారణాల వల్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించిన నేపథ్యంలో ప్రాథమిక దశలో స్థానిక బీచ్‌రోడ్డు నుంచి నేరుగా సంబంధిత భూముల్లోకి వెళ్లేందుకు అనువుగా రహదారి నిర్మిస్తామని, ఆ తర్వాత భనవ సముదాయాల పనులు చేపడతామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



యంత్రంతో పనులు చేపడుతున్న దృశ్యం

అప్రమత్తంగా లేకుంటే.. ఆసుపత్రికే..!

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారులు ప్రమాదకరంగా మారడంతో రోగులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింహాచలం బీఆర్టీఎస్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రహదారి విస్తరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వద్ద రహదారి.. పాత రోడ్డు కన్నా బాగా ఎత్తు పెరిగింది. దీంతో ప్రధాన రహదారి నుంచి ఆసుపత్రికి వెళ్లే అనుసంధాన మార్గం తీవ్ర సమస్యాత్మకంగా మారింది. ప్రధాన మార్గం ఇబ్బందికరంగా ఉండడంతో శిడగంపేటకు వెళ్లే మార్గంలో ప్రహరీని తొలగించి రెండవ మార్గం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రెండు మార్గాలు బాగా ఏటవాలుగా మారాయి. కంకర వేసి వదిలేయడంతో రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉంది. శిడగంపేట దారిలో రోడ్డుకు సమాంతరంగా పెద్ద కాలువ ఉండడంతో ద్విచక్ర వాహనాలు రాళ్లపై జారి కాలువలో పడిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి మార్గాలు అధ్వానంగా తయారవడంతో అంబులెన్సుకు కూడా దారి లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ దారుల్లో ఆసుపత్రికి వెళ్లి తిరిగి బయటకు రావాలా..? అక్కడే చికిత్సకు చేరిపోవాలా..? అంటూ రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి రోడ్లు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన ఆసుపత్రి మార్గం

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 5వవార్డు గణేష్‌నగర్‌లో మారుతీబాక్సింగ్ క్లబ్, వారస్ టెక్నాలజీస్ సంస్థ సంయుక్తంగా గురువారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఛత్రపతి శివాజీ వాలంటీర్ బ్లడ్ బ్యాంక్ వైద్య నిపుణులు చేపట్టిన ఈ శిబిరంలో వైజాగ్ వాలంటీర్స్‌తో పాటు జేవై ప్రీ డిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు, పలువురు యువత ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీప్రసాద్ పేదలకు ఉచితంగా దుప్పట్లు అందించి మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. స్థానిక నాయకులు వంగపండు ఉష, పోతిన శ్రీనివాసరావు, పిల్లా సూరిబాబు, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, బంగారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ధ్రువపత్రాలు అందించి అభినందిస్తున్న నిర్వాహకులు

జంతు ప్రదర్శనశాలలో సదస్సు

ఎండాడ, న్యూస్‌టుడే: సెంట్రల్ జూ అథారిటీ (సీజెడ్ఏ)న్యూదిల్లీ సహకారంతో ఈనెల 24 నుంచి మూడు రోజుల జాతీయ స్థాయి 'జూ కన్జర్వేషన్ బయాలజిస్ట్ వర్క్‌షాప్'ను విశాఖ జూలో అటవీశాఖ కన్జర్వేటర్ బి.ఎం.దివాన్ మైదీన్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జంతు ప్రదర్శన శాలల్లో వివిధ పద్ధతులను మెరుగుపర్చడం, జూలోని మూగజీవాల సంక్షేమాన్ని పెంపొందించడంపై ఎంతో మంది నిపుణులు తమ అనుభవాలు పంచుకునేందుకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. డాక్టర్ దేవేందర్ కుమార్ (సెంట్రల్ జూ అథారిటీ), గయా మిత్ర ఫౌండేషన్ డైరెక్టర్ గౌరి మల్లాపూర్, డాక్టర్ అసిత్ దాస్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ తదితరులు కూడా మాట్లాడారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అటవీశాఖ కన్జర్వేటర్ దివాన్ మైదీన్

కన్వెన్షన్ సెంటర్ పనులు వేగవంతం చేయాలి

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడలో నిర్మిస్తున్న వీఎంఆర్డీఏ కన్వెన్షన్ సెంటర్‌ను వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ గురువారం పరిశీలించారు. దీనికి సంబంధించిన నిర్మాణ పనుల స్థితిగతులను ప్రధాన ఇంజినీరు భవానీశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. ఇక్కడి అప్రోచ్ రహదారి ఆకృతి పరిశీలించి తగిన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఈఈలు రామరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనుల స్థితిగతులపై వివరాలు తెలుసుకుంటున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ తూర్పు

ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్, టైలరింగ్‌లో శిక్షణ



ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారంలోని ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్ టైలరింగ్‌లలో ప్రాథమిక శిక్షణ ఇప్పిస్తున్నట్లు కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 3 నెలల కాలపరిమితికి శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశం, జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ, సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ సలహా మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో బ్యాచ్‌కి 30 మంది చొప్పున మొత్తం 720 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఏయూ సోషల్ వర్క్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఏయూ ప్రాంగణం: ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. ప్రభుత్వ మానసిక చికిత్సాలయం, ఆర్.సి.ఓ.ఇ. ఉప్పుకుటీరాలను సందర్శించారు. విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.అబ్రహం, డాక్టర్ జె.పుష్పలత, డాక్టర్ సూరిబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై పోటీలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాల, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు - అవగాహన అన్న అంశంపై విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శాంతిభద్రతల ఎస్సై కృష్ణ తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన శిబిరం

ఆరిలోవ: ఆరిలోవ ముత్యాలమ్మ దగ్గర నాయుడు పోలీ క్లినిక్ ఆవరణలో గురువారం మెడికవర్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ ఆర్.ఎస్.నాయుడు, వైద్యులు ప్రసాద్, ప్రవీణ్, జైసాయి చందు, ఆర్.ఎస్. నాయుడు, నర్సులు పాల్గొన్నారు.

దీపావళి పర్యావరణహితంగా నిర్వహిద్దాం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: దీపావళి పండుగను పర్యావరణహితంగా నిర్వహిద్దామని ఎ.ఎస్.రాజా మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వాసు అన్నారు. గురువారం సాయంత్రం ఎంవీపీకాలనీలోని కళాశాల ఆవరణలో గ్రీన్‌క్లైమేట్ టీమ్ సీపీ సంస్థ సహకారంతో పర్యావరణహిత దీపావళి గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకోవైజాగ్‌ను జయప్రదం చేయాలని, పశు పక్ష్యాదులకు హాని కలిగించవద్దని సూచించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, సీపీ ప్రతినిధులు హేమ, నర్సింగ్, భాస్కర్, అధ్యాపకులు శాంతి, కృష్ణవేణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఐఆర్‌సీటీసీ శబరిమల యాత్రపై అవగాహన

ఎం.వి.పి.కాలనీ: ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ అయ్యప్ప భక్తుల కోసం ఏర్పాటు చేసిన శబరిమల యాత్రపై ప్రగతి భవనంలో అవగాహన కల్పించారు. ఐఆర్‌సీటీసీకి చెందిన పలువురు ఉద్యోగులు ఈ నెల 16 నుంచి 20 వరకు శబరిమల యాత్రకు సంబంధించిన కరపత్రాలను అందజేసి వివిధ సంక్షేమ శాఖల ఉద్యోగులకు వివరించారు.

నేటి నుంచి పశుగణన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి పశుగణన పక్కాగా నిర్వహించాలని సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ అన్నారు. పాతడెయిరీఫారం కూడలిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నాలుగు నెలల పాటు దేశవ్యాప్తంగా పశుగణన జరుగుతుందని అందుకు నియమించిన సిబ్బంది ఒక దీక్షలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు విషయ సేకరణదారులకు, పర్యవేక్షకులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలా గణన నిర్వహించాలి, యాప్‌లో ఎలా నమోదు చేయాలి తదితర అంశాలు వివరించారు. ఇంటింటికి వెళ్లి పశుగణనకు ఉపయోగించే పత్రాలు, కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకులు సజ్జా శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్, రమణ, పశు వైద్యులు, పాల్గొన్నారు.

సొంత గూడు కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు నిరాశే మిగిలింది. కేటాయించిన పక్కా గృహాల్లో కూటమి ప్రభుత్వంలోనైనా ప్రవేశం చేయాలని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో గత తెదేపా హయాంలో కేటాయించిన టిడ్కో గృహాలను ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్ని నిర్మాణ దశలో ఉండగా.. మరికొన్నింటికి మౌలిక సదుపాయాలు లేవు. దీంతో ఇప్పటికీ అందులో ప్రవేశం జరగలేదు.
– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



చీమలాపల్లిలో టిడ్కో గృహ సముదాయం

గూడు.. కావాలి సర్కారు తోడు

టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపు

అంతా ప్రచార ఆర్భాటమే..

2014-2019 కాలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం పక్కా ఇళ్లను మంజూరు చేసింది. నాటి తెదేపా హయాంలో జీవీఎంసీ, అనకాపల్లి పరిసరాల్లో పలు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించి టిడ్కో గృహ సముదాయాల నిర్మాణాలను ప్రారంభించారు. ఇందుకు నియోజకవర్గం నుంచి సుమారు 25 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. అయితే ఎన్నికలు రావటంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

★ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా తూర్పు నియోజకవర్గం లబ్ధిదారుల కోసం కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకుంది. ఉన్న నిధులతోనే నిర్మాణాలను ప్రారంభించింది తప్ప మరెక్కడా కొత్త ప్రాజెక్టులు చేపట్టలేదు.

★ సుమారు 9 వేల మంది వరకు లబ్ధిదారులు వాటాను డీడీల రూపంలో చెల్లించారు. ఇళ్ల కోసం పెద్ద ఎత్తున ఒత్తిడి రావటంతో వైకాపా హయాంలో నియోజకవర్గానికి 3210 ఇళ్లను కేటాయించారు. వీటిలో 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు 270.. 365 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు 578.. 430 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు 2362 చొప్పున ఉన్నాయి.

★ 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్లను నడుపూరు, పరవాడ, రాతిచెరువు, ఎస్.ఎన్.పురంలో.. 365 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు అచ్చిన్నాయుడులోవ, ఐబ్బన్నపాలెం, చీమలాపల్లి, కొండకొప్పాక, పద్మనాభనగర్, పరవాడ, సంగివలస.. 430 ఎస్ఎఫ్‌టీ నివాసాలను ఆనందపురం, అచ్చిన్నాయుడు లోవ, బానోజీనగర్, దబ్బంద, దువ్వాడ, కొమ్మాది, మంత్రిపాలెం, పద్మనాభనగర్, పెదగంట్యాడ, రాతిచెరువు, ఎస్.ఎన్.పురం ప్రాజెక్టుల్లో కేటాయించారు.

★ అయితే 365, 430 ఎస్ఎఫ్‌టీ ఇళ్లు కేటాయించిన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు కూడా ఇప్పించారు. అధికారికంగా కేటాయించినా ఇప్పటి వరకు వాటిని లబ్ధిదారులకు అప్పగించలేదు. పరవాడ, ఎస్ఎన్‌పురం, రాతిచెరువు, దబ్బంద, అగనంపూడి వంటి ప్రాజెక్టుల్లో మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన వాటికి వైకాపా రంగులు వేసుకున్నారే తప్ప ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో వీటిని పూర్తిస్థాయిలో తమకు ఎప్పుడు అప్పగిస్తారోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



దబ్బందలో..

వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తాం



టిడ్కో లబ్ధిదారులకు కేటాయించిన గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని పలువురు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యను కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ల వద్దకు తీసుకెళ్లి నిర్మాణాలు పూర్తయిన వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అలాగే నిర్మాణ దశల్లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసేలా అధికారులతో చర్చిస్తాను.
– వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

● సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-3లో ప్లాట్ నెంబరు 31 దరి 28/ఎ/7/1 పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు. – ఆదినారాయణ

● సమాధానం : పరిశీలించి దీపాలకు మరమ్మతులు చేపడతాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

ప్రతిభ చాటి.. ఉత్తమంగా నిలిచి

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ, అప్సరాకాలనీలో ఉన్న విశ్వ విజ్ఞాన్ విద్యాలయంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, సోషల్ మీడియా ప్రభావం' వంటి అంశాలపై జరిగిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వి.నిఖిత (9వ తరగతి), వి.కిశోర్ (8వ తరగతి), వి.శ్రావ్య (8వ తరగతి)లు ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.




వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందుకున్న విజేతలు, ఉపాధ్యాయులు

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి), త్యాగరాజు ఆరాధన ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతుల జీవితంపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను పాఠశాల, కళాశాల స్థాయిల్లో నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులను ఎంపీ శ్రీభరత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్. రాజు, జీఆర్కేప్రసాద్ (రాంబాబు), పలువురు పాల్గొన్నారు.



విజేతకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, నిర్వాహకులు



హాజరైన విద్యార్థులు తదితరులు

జాతీయ పారా స్విమ్మింగ్‌లో ప్రతిభ



ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: గోవా పనాజీ జిల్లా ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్ వేదికగా ఇటీవల జరిగిన జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో నగరానికి చెందిన **షేక్ కౌసర్ షాహిల్** 50 మీటర్లు, 100 మీటర్లు ఫ్రిస్టైల్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. షాహిల్ కేంద్రీయ విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్నాడు. షాహిల్ తండ్రి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్)లో ఉద్యోగి. పలువురు అభినందించారు.

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందని, బూత్ స్థాయిల్లో ఎక్కువ మంది సభ్యత్వాలు పొందేలా చూడాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎంవీపీకాలనీ తెదేపా కార్యాలయం వద్ద నియోజకవర్గ ముఖ్య నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయటం జరుగుతుందన్నారు. కార్యకర్తల కుటుంబాల్లోని విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం, ఉపాధి పొందేలా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై ఎక్కువ ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్, నాయకులు బుడుమూరి గోవింద్, ఒమ్మి అప్పలరాజు, పోతన్నరెడ్డి, బుగత సత్యనారాయణ, ఒమ్మి అప్పారావు, బలగ సుధాకర్, పల్లా ఉమారాణి, కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

సీఐ క్షేత్రస్థాయి పరిశీలన

స్పందనకు వందన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బేకాలనీ వేంకటేశ్వర ఆలయ ఆవరణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంవీపీ సి.ఐ జె.మురళి గురువారం సిబ్బందితో వచ్చి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యుద్దీపాలు వెలిగేలా, అనంతరం ఆలయం నుంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ఆలయ అధికారులకు సూచించారు. చెట్టు కొమ్మలు కొట్టించేందుకు స్థానికులు రాజశేఖర్‌తో పాటు మరికొంత మందితో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అవసరమైతే రాత్రిపూట బీట్‌కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సి.ఐ మురళి

సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డీన్ తదితరులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన అంతర కళాశాల కబడ్డీ పోటీల్లో సమతా కళాశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించారు. దీంతో ఈ నెల 30 నుంచి మద్రాసులో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఏయూ కబడ్డీ జట్టు తరపున అలీ, సాయి, హేమంత్‌కుమార్, వీరబాబు ఎంపికయ్యారు. వీరిని కళాశాల డీన్ ఆచార్య విజయారవీంద్ర, డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పి.డి.రామకృష్ణ అభినందించారు.

కన్వెన్షన్ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గురువారం ఎండాడ వద్ద నిర్మాణం చేపడుతున్న కన్వెన్షన్ సెంటర్‌ను వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్‌కు సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనం ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సివిల్ పనులు, శీతలీకరణ, విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా సంస్థకు అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్ అప్రోచ్ రహదారి డిజైన్‌లో పలు మార్పులు చేర్పులు చేశారు. కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, సుధీర్, అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ విశ్వనాథన్

అట్టహాసంగా జె.కామ్ జోన్-4 మెగా సమ్మేళనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ జె.కామ్ జోన్-4 మెగా సమ్మేళనం నగరంలో ఘనంగా జరిగింది. జోన్ ఛైర్మన్ రామసూర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 200 మంది వివిధ వ్యాపార, వాణిజ్యవేత్తలు పాల్గొని తమ వ్యాపార విధానాలను వివరించారు. వ్యాపారంలో విజయం అంశంపై పలువురు సభ్యులు మాట్లాడారు. నవంబరులో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్ గోడపత్రికను ఆవిష్కరించారు. జోన్ ప్రతినిధులు కె.వి.రావు, సురేష్, శివశంకర్, రాధాకృష్ణ, రాజశేఖర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ ఛాంబర్స్ ప్రతినిధులు



మాట్లాడుతున్న మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్

యూఎన్‌వో సేవలు నిరుపమానం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం ఇంటర్నేషనల్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్), బీవీ ఫౌండేషన్ ఫర్ హార్మోని సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ ఎస్.వి.వి.పి.వి.ఎం.సి. డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా జరిగింది. తొలుత సర్వమత ప్రార్థన నిర్వహించారు. ఐఏఆర్ఎఫ్ ఛైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించి, యూఎన్‌వో పనితీరు, లక్ష్యాలు, సంస్కరణల గురించి వివరించారు. విశ్వశాంతి-యుఎన్‌వో పాత్ర అంశంపై ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వరరావు, గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, డాక్టర్ బాబ్జీ, అబ్దుల్ తదితరులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొల్పి, అన్ని దేశాల్లోను సుస్థిరతను కాపాడటంతో సమితి చేసిన సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: చిన్నగదిలి సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి గురించి గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం దృశ్య కావ్యం ప్రదర్శించారు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి నెలకొల్పడానికి ఐక్యరాజ్య సమితి దోహదపడుతుందని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. సిరిపురం నారాయణ కళాశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కెండేయులు, నారాయణ కళాశాల డీన్లు నరేష్‌కుమార్, శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌వీవీపీవీఎంసీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు



చినగదిలి సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో..

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల సభ్యులంతా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలని యూజీడీ పీడీ సత్యవేణి అన్నారు. గురువారం జోన్-3 కార్యాలయ సమావేశమందిరంలో యూసీడీ సిబ్బంది, ఆర్పీలతో ఆమె సమావేశమయ్యారు. విధులను నిబద్ధతతో, అంకిత భావంతో చేపట్టాలని సూచించారు. ఆర్పీలపై అనేక ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో అధికార దుర్వినియోగం, నిర్లక్ష్యం కనబర్చిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధిగా నెలవారీ సమావేశాలు ఏర్పాటు చేసి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. యూసీడీ ఏపీడీ ఎల్.రాము, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీడీ సత్యవేణిని అభినందిస్తున్న యూసీడీ సిబ్బంది

ఏయూలో పలు విభాగాల తనిఖీలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు గురువారం వర్సిటీలో విద్య, తత్వశాస్త్రం, ఆంగ్లం, గ్రంథాలయం, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, చరిత్ర, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు జరుగుతున్న బోధనను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లో నివాసముంటున్న టంకాల సునీత (32) సబ్బవరం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రవణ్‌కుమార్‌తో 2018లో పెద్దల సమక్షంలో వివాహమైంది. నాటి నుంచి పుట్టింటికి వెళ్లి డబ్బులు తేవాలని భర్త డిమాండు చేసేవాడు. తరచూ వేధించడంతో గత కొంతకాలంగా ఆమె రామ్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. అయినా ఫోన్లో లేదా ఇక్కడికి వచ్చి డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యానికి పాలైంది. దీంతో ఇటీవల రామ్‌నగర్‌లోని ఓ కార్పొరేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడు వేధింపులే కారణమని మృతురాలి తండ్రి కాళేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ రమణయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏయూ అందించే ధ్రువపత్రాలకు అమితమైన విలువ ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రీజనల్ డైరెక్టర్ బీరేంద్ర సింగ్, సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

మద్యం దుకాణం వివాదంపై ఎమ్మెల్యే ఆరా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పందిమెట్ట వద్ద మద్యం దుకాణం ఏర్పాటుపై తలెత్తిన వివాదానికి సంబంధించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. రెండు రోజులుగా మద్యం దుకాణం విషయంలో స్థానికులు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన గురువారం ఆ ప్రాంతానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు గురువారం పోలీసు సమావేశ మందిరంలో నిర్వహించారు. పలు స్టేషన్లకు చెందిన సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఛాలెంజెస్ టు ఇన్ ది ప్రొటెక్షన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై జరిగిన ఈ పోటీల్లో 48 మంది సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఏయూకు చెందిన ఆచార్యులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యంగా ఉంటారని ఏయూ ప్లాటినమ్ జూబ్లీ డీన్, బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజ్ అన్నారు. ఏయూ మహిళల కబడ్డీ ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ ఎంపికలు ఏయూ జిమ్నాజియంలో గురువారం జరిగాయి. మహిళల ఇంటర్ కాలేజియేట్ పోటీల్లో చీపురుపల్లి ఎస్.వి.ఎస్.డిగ్రీ కళాశాల, ప్రభుత్వ కళాశాల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో ఎస్.వి.ఎస్. డిగ్రీ కళాశాల 44 పాయింట్లతో విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం ఆడిన కబడ్డీ సత్యా డిగ్రీ కళాశాలపై వీజీడీసీ ఉమెన్ కళాశాల 12 పాయింట్లతో విజయం సాధించింది. డీన్ ఆచార్య ధనరాజ్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ విజేతలకు ధ్రువపత్రాలు అందించి అభినందించారు.



విజేత జట్టుతో కోచ్‌లు

వైకాపా నాయకులే జగన్‌ను నమ్మడం లేదు: హోంమంత్రి అనిత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రస్తుత స్థితిలో వైకాపా నాయకులే నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం విశాఖ జడ్పీ కార్యాలయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ సొంత బాబాయ్ హత్యను అధికారంలోకి రావడానికి ఉపయోగించుకున్న చరిత్ర జగన్‌కు ఉందన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని మోసం చేశారని, ఇప్పుడు వారిని ఇబ్బంది పెడుతున్నా రని దుయ్యబట్టారు. ఏదో ఒక రోజు షర్మిల, విజయమ్మపై జగన్ కేసు పెడతారని తాను ఊహించానని, ఇప్పుడు అదే జరిగిందన్నారు. ఆస్తి కోసం తాము రక్తం కల్పిస్తున్నామన్నామని చెప్పారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా ప్రబలిన ఘటనపై ఐఏఎస్ అధికారి విజయానంద్ విచారణ జరుపుతున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వ తప్పిదాల కారణంగా ఇప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

సమస్య: కాన్వెంట్ కూడలి, చావలమదుం ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేవు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.
– దుక్క ప్రసాద్, జ్ఞానాపురం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

సమాధానం: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్ షెల్టర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– మల్లయ్యనాయుడు, జెడ్సీ

అ వీ ఇ వీ

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం 11 కె.వి. సెక్షన్‌లోని శైలజాపురం ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని కస్తూరినగర్ 1, 2, మధుసూదన్‌నగర్, దుర్గాలైలాస్‌నగర్, సత్యసాయినగర్ ప్రధాన రహదారి, శైలజాపురం, నరసింహనగర్, రైతుబజార్, బిజినెస్ సెంటర్, విద్యుత్‌నగర్, బి.ఎస్.లేఅవుట్, ఎన్‌జీజీఓఎస్ కాలనీ, సచివాలయం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: ఆశీల్‌మెట్ట సెక్షన్ పరిధిలోని 11కేవీ విద్యుత్తు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటేశ్వర కళాశాల, తహసీల్దార్ కార్యాలయం, సత్యంకూడలి, సునీతా నర్సింగ్‌హోం పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-1 డీఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

■ దళిత క్రిస్టియన్లను ఎస్సీలో చేర్చాలి

సీతంపేట, న్యూస్‌టుడే: దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.బాబూరావు కోరారు. ఆల్ ఇండియన్ క్రిస్టియన్ మైనార్టీ ఫ్రంట్ ఆధ్వర్యంలో సీతంపేటలోని ఓ చర్చిలో నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

■ ధ్రువీకరణ పత్రాలు అందజేత

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాత ఐటీఐలో స్కిల్‌హబ్ ద్వారా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు గురువారం ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వీరికి మూడు నెలల పాటు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై.ఉమాశంకర్, కె.ఝాన్సీ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

■ 29 నుంచి క్రీడా ఎంపికలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాలోని సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ తెలిపారు. 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ, టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, 30న క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డాన్స్ షార్ట్‌ప్లే వాలీబాల్, యోగా, బెస్ట్‌ఫిజిక్ అంశాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 28 ఉదయం 11.30 గంటలకు కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఆధార్‌కార్డు, డిపార్ట్‌మెంటు గుర్తింపు కార్డులతో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

■ ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టయో ల్యాబ్స్ ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చేవారికి మధుమేహం, కిడ్నీ పనితీరు, రక్తపోటు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

■ రేపు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టర్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితాభవన్‌లో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అనిల్‌నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సౌజన్యంతో ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఈ శిబిరంలో అవసరమైన దంత పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు సూచనలు అందజేస్తారని వారు పేర్కొన్నారు. కాలనీవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తూతూమంత్రంగా దోమల నివారణ

● కనిపించని మలేరియా కార్మికులు
● వార్డుల్లో ప్రబలుతున్న జ్వరాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో మలేరియా కార్మికుల జాడ కానరావడం లేదు. దీంతో దోమల వృద్ధి రోజురోజుకు అధికమవుతోంది. ముఖ్యంగా పాతనగరంలో రహదారులు, కాలువల నిర్మాణం జరుగుతుండటంతో నివాసాల్లో వినియోగించిన నీరు నిల్వ ఉండిపోతోంది. అక్కడక్కడా రహదారులపై ప్రవహిస్తోంది. ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. నియంత్రించాల్సిన జీవీఎంసీ మలేరియా విభాగ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయడం లేదు.

★ జీవీఎంసీ పరిధిలోని ఒక్కో వార్డుకు నలుగురు మలేరియా కార్మికులను కూలి ప్రాతిపదికన నియమించారు. వారంతా నివాసాల వద్దకెళ్లి నీటి ట్యాంకుల్లో దోమల లార్వాలను పరిశీలించడం, భవనాలపై ఉండే ట్యాంకుల్లో దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలు చల్లడం, జ్వర బాధితులు ఉంటే వారి వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు చేరవేయాలి. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు చేయించాల్సి ఉంది.


నీటి ట్యాంకులో దోమల లార్వాలను పరిశీలిస్తున్న మలేరియా కార్మికురాలు

★ ఈ ఏడాది ఇప్పటి వరకు మలేరియా కేసులు 120, డెంగీ కేసులు 8 అధికారికంగా నమోదు కాగా, డెంగీ కేసులు 40 దాటి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలేరియా కార్మికులు నిత్యం విధులకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని, పాతనగరంలో దోమల నివారణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

★ జీవీఎంసీ పాలకవర్గం ఏర్పాటైన తరువాత మలేరియా కార్మికులను నియమించారు. అయితే వారు పెద్దగా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. వైకాపా కార్పొరేటర్లు, నాయకులు సూచించిన వారినే కార్మికులుగా నియమించడంతో వారిపై మలేరియా ఇన్‌స్పెక్టర్లు పని చేయాలని ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారు. బయోమెట్రిక్, ఐరిష్ హాజరు లేకపోవడంతో నెలలో ఒకటి, రెండు రోజులు అలా వచ్చి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాతనగరంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ కేసులు అధికమవుతున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో నమోదవుతున్న కేసులను జీవీఎంసీ పరిగణనలోకి తీసుకోకపోవడంతో వాటిని అధికారికంగా గుర్తించడం లేదు.

త్వరలో అందుబాటులోకి అధునాతన డ్రైవింగ్ ట్రాక్

మాధవధార, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు ఆటో మెటిక్ ఫిట్‌నెస్, డ్రైవింగ్ ట్రాక్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని రవాణాశాఖ డీటీఓ జి.ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయన గంభీరం ట్రాక్‌లో ఆటోమెటిక్ ఫిట్‌నెస్ కేంద్రం పనులను పరిశీలించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిలిగిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదార్లను ఆదేశించారు. అలాగే ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ పనులు కూడా జరుగుతున్నాయని, అది కూడా త్వరలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఐ.వేణుగోపాల్, బుచ్చిరాజు, బాలాజీ, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆటోమెటిక్ ఫిట్‌నెస్ కేంద్రం వద్ద డీటీఓ ఆదినారాయణ, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర నిఘా

మాధవధార, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం నిఘా ఉంచాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి ఆయన పశ్చిమ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. పశ్చిమ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, తదితర అంశాలపై దస్త్రాలను రాత్రి 12 గంటల వరకు పరిశీలించారు. గంజాయి, పోక్సో నేరాలు, చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏసీపీ అన్నెపు నరసింహమూర్తికి పలు సూచనలు చేశారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ల పరిధిలో హనీట్రాప్ కేసుల విచారణ గురించి తెలుసుకున్నారు. పెందుర్తి, గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు, కంచరపాలెం స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


పశ్చిమ ఏసీపీ కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

సాయినాథుడి సన్నిధిలో అన్నదానం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని శిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు మంత్రోచ్ఛారణ నడుమ వైభవంగా సాయినాథుడికి అర్చనలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు, పేదలకు అన్నప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ఘన స్వాగతం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఆయనకు తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, దక్షిణ నియోజకవర్గ బాధ్యుడు సీతంరాజు సుధాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.


మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా నాయకులు

ఘనంగా సామూహిక పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే: కప్పరాడ శ్రీవైభవ వేంకటేశ్వరుని ఆలయ అన్నదాన భవనంలో గురువారం శ్రీ అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. జయలక్ష్మి మాతా మాతృమండలి, చింతామణి గణపతి దత్త క్షేత్రం ఆధ్వర్యంలో దత్తాత్రేయుని సతీమణి అనఘాదేవి పేరిట ప్రతీనెలా నగరంలోని వివిధ ఆలయాల్లో ఈ వ్రతం జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వ్రత పూజలో కాలనీలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంవీ శేషమ్మ పేర్కొన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో కొత్తగా చేరిన విద్యార్థులకు గురువారం కళాశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి ఎంవీ శేషమ్మ, ఏసీపీ లక్ష్మణమూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రకిషోర్ పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి.. నిందితులకు పడే శిక్షలను తెలియజేశారు. ఎవరూ డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని సూచించారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎంవీ శేషమ్మ చిత్రంలో ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు, ఏసీపీ లక్ష్మణమూర్తి, తదితరులు

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

మాధవధార, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల వేతనాల నుంచి ఉపసంహరించిన ఆదాయపన్ను నిధులను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం 49,50,51 వార్డుల పారిశుద్ధ్య కార్మికులు నిరసన చేపట్టారు. వేతనాలు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జోన్-5 కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, భద్ర, పాపారావు, దేవి, లక్ష్మీ, రమణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాధవధార, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 8 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి.. బర్మా క్యాంప్ గిరిజనగర్ వద్ద నివాసం ఉంటున్న పి.సతీష్ కుమార్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో రాయగడ వెళ్లారు. అనంతరం రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం విరగొట్టి ఉంది. బీరువాలో బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గ్రహించి కంచరపాలెం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మాధవధార, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెందిన వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాజీ జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న బెహర రీత (24) రైల్వే లాండ్రీలో పనిచేస్తోంది. భర్త శివ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా రీత మనస్తాపంతో ఉంది. గురువారం ఉదయం కంచరపాలెం గొల్లవీధిలోని సోదరి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలోకి వెళ్లి ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బి.రీత (పాతచిత్రం)

కుటుంబ సభ్యుల చెంతకు బాలుడు

గురుద్వారా, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వచ్చేసిన బాలుడు పోలీసుల చొరవతో తిరిగి కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన బాలుడు(13) మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వచ్చేశాడు. తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆ ప్రాంత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడు గురువారం ఉదయం విశాఖ రైల్వేస్టేషన్‌లో రైలు దిగాడు. తర్వాత ఆటో ఎక్కి నగదు ఇవ్వకుండా పరారవగా స్థానికులు పట్టుకుని నాలుగోపట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని ఆరా తీయగా ఇంటి నుంచి వచ్చేశానని చెప్పడంతో పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'దానా' ప్రభావం..
వెలవెలబోయిన రైలు నిలయం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో తూ.కో. రైల్వే మీదుగా రాకపోకలు సాగించాల్సిన దాదాపు 50 రైళ్లు గత మూడు రోజులుగా విడతల వారీగా రద్దయ్యాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లు, పాదచారుల వంతెనలు ప్రయాణికులు లేక వెలవెలబోయాయి. రద్దయిన రైళ్ల గురించి ప్రయాణికులకు సంక్షిప్త సందేశాలు పంపించడంతో విశాఖ స్టేషన్‌లో రద్దీ పూర్తిగా తగ్గిపోయింది. అయితే కనెక్టింగ్ రైళ్ల కోసం విశాఖ చేరుకొని చిక్కుకుపోయిన వందలాది మందికి మాత్రం పాట్లు తప్పలేదు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే కూర్చుని కాలం వెళ్లదీస్తున్నారు. మరో పక్క ఈనెల 25న బయలుదేరాల్సిన పురిలియా-తిరునల్వేలి(22606), హావ్‌డా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రద్దయిన రైళ్ల సమాచారాన్ని ప్రయాణికులకు చేరవేస్తున్నారు.


స్టేషన్ పరిసరాల్లో ప్రయాణికుల పడిగాపులు


నిర్మానుష్యంగా ప్రధాన పాదచారుల వంతెనలు

మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని కళాభారతిలో గురువారం కందుకూరి విరేశలింగం పంతులు సాహితీ సేవ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జైలురోడ్డులోని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఎస్.ఆశ్రిత, వి.మనీషా, పి.వెంకట శివానీ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారన్నారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాలలో అభినందించారు.


ప్రతిభ చూపిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ మంజుల

అట్టహాసంగా జె.కామ్ జోన్-4 మెగా సమ్మేళనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ జె.కామ్ జోన్-4 మెగా సమ్మేళనం నగరంలో ఘనంగా జరిగింది. జోన్ ఛైర్మన్ రామసూర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 200 మంది వివిధ వ్యాపార, వాణిజ్యవేత్తలు పాల్గొని తమ వ్యాపార విధానాలను వివరించారు. వ్యాపారంలో విజయం అంశంపై పలువురు సభ్యులు మాట్లాడారు. నవంబరులో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్ గోడపత్రికను ఆవిష్కరించారు. జోన్ ప్రతినిధులు కె.వి.రావు, సురేష్, శివశంకర్, రాధాకృష్ణ, రాజశేఖర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏయూ అందించే ధ్రువపత్రాలకు అమితమైన విలువ ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రీజనల్ డైరెక్టర్ బీరేంద్ర సింగ్, సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

కుటుంబాల చెంతకు నిరాశ్రయులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మతిస్థిమితం కోల్పోవడం, తదితర కారణాలతో వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి చేరుకున్న వారికి ఆశ్రయ కేంద్రం నిర్వాహకులు చికిత్స అందించి కోలుకునేలా చేశారు. శ్రద్ధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారిని తిరిగి కుటుంబ సభ్యుల వద్దకు చేరుస్తున్నారు. గురువారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పరమేశ్వర్, దీపక్‌శర్మ, మహారాష్ట్రకు చెందిన రాహుల్ వసంత్, రవీంద్ర యశ్వంత్, బిహార్‌కు చెందిన రవీంద్రకుమార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్‌సరోవర్‌ను టీవీ స్నార్ ఆశ్రయ కేంద్రం నిర్వాహకులు శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగించారు. వారిని స్వస్థలాలకు తరలించనున్నారు.



నిరాశ్రయులతో ఆశ్రయ కేంద్రం నిర్వాహకులు

చట్టాలపై అవగాహనతో సత్ఫలితాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జాతీయ వివేకానంద మానవహక్కుల సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్ సంఘం లోకేష్ అన్నారు. గురువారం ఊర్వశికూడలి సమీప స్టీల్‌సిటీ పబ్లిక్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి త్రినాధ్, కోఆర్డినేటరు రాజు, ఆదినారాయణ, కుమార్, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సహాయక చర్యల మాక్‌డ్రిల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లతోపాటు స్టేషన్‌లలో అనుకోకుండా ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన సహాయక చర్యలపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విశాఖ జోనల్ శిక్షణ కేంద్రంలో సివిల్ డిఫెన్స్, రెస్క్యూ బృందాలు చేపట్టిన ఈ నమూనా ప్రదర్శన ఆకట్టుకుంది. వాల్తేర్ సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి సిద్ధార్థ్ ప్రదాన్ మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ఈ బృందాలు క్రియాశీలకంగా వ్యవహరించి సహాయక చర్యలు చేపడతాయన్నారు. ఈ సందర్భంగా సివిల్ డిఫెన్స్ వాలంటీర్ల ప్రదర్శనను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తిలకించి అభినందించారు.


విపత్తుల సమయంలో రక్షణ చర్యలపై నమూనా ప్రదర్శన

భాజపా సభ్యత్వ నమోదు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: 55వ వార్డు తాటిచెట్లపాలెంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. వార్డు అధ్యక్షురాలు పార్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియను భాజపా నార్త్ ఇన్‌ఛార్జి సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షుడు భాస్కర్, భాజపా నాయకులు కొప్పిశెట్టి శంకర్రావు, డి.వెంకటరమణ, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్, టైలరింగ్‌ల్లో శిక్షణ

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్ర కారాగారంలోని ఖైదీలకు వెల్డింగ్, ప్లంబింగ్ టైలరింగ్‌లలో ప్రాథమిక శిక్షణ ఇస్తున్నట్లు కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 3 నెలల కాలపరిమితికి శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశం, జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ, సివిల్ జడ్జి ఎం.వి శేషమ్మ సలహా మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో బ్యాచ్‌కి 30 మంది చొప్పున మొత్తం 720 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు.

గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ రామకృష్ణ, ఏఈ వీరయ్య

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన రూఫ్‌టాప్ పీఎం సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ రామకృష్ణ సూచించారు. సౌరశక్తి పథకంపై ప్రజలకు వివరించేందుకు గురువాకం కణితి గాంధీ విగ్రహం కూడలిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పథకంతో కలిగే ప్రయోజనాలు వివరించి, ప్రజల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో జోన్-2 ఈఈ బీకే.నాయుడు, ఏఈ వీరయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● వేగ నిరోధకాల ఏర్పాటు

సింధియా, మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 40, 61, 62, 63 వార్డుల పరిధిలోని వివిధ రహదారుల్లో గురువారం వేగ నిరోధకాలు నిర్మించారు. నిత్యం రద్దీగా ఉండే ఆయా మార్గాల్లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ప్రజా పనుల విభాగం ఏఈ బాబూరావు, కూటమి నాయకులు మజ్జి మాలినాయుడు, నీలాపు జోగిబాబు పర్యవేక్షించారు.

● దరఖాస్తుల గడువు పెంపు

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్): డిప్లొమో పారా మెడికల్ కోర్సుల్లో చేరే వారికి దరఖాస్తుల గడువు వచ్చే నెల 3 వరకు పొడిగించినట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్. నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు వచ్చే నెల 12 వరకు అవకాశం ఉందన్నారు. ఇంటర్లో ఏ గ్రూపు పాసైనా... దరఖాస్తు చేసుకోవడానికి అర్హులేనన్నారు. మరిన్ని వివరాలకు 79950 13421 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'సైబర్ క్రైమ్' నియంత్రణ చర్యలపై అవగాహన

గోపాలపట్నం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం గోపాలపట్నం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.'సైబర్ క్రైమ్‌ను నిరోధించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ కె.మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను సీఐ సురేశ్, ఎస్సై అప్పలనాయుడు పర్యవేక్షించారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రతిభ చూపి.. విజేతలుగా నిలిచే...!



గొన్నవానిపాలెం ఏబీఎస్ పాఠశాలలో..

కూర్మన్నపాలెం శ్రీరామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో, అగనంపూడి సమీప గొన్నవానిపాలెం ఏబీఎస్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభమా-నష్టమా', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాలను తమదైన శైలిలో, విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు.

● శ్రీరామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు వేములపూడి కల్యాణి, పైడి అలేఖ్య, చింతాడ లలితకు ప్రిన్సిపల్‌పొన్నాడ లలితకుమారి, కరస్పాండెంట్ వాసుదేవరావు, ఇతర ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

● ఏబీఎస్ పాఠశాలలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఎస్. గాయత్రి, ఎం.నిఖిల్, వి.నివేదితకు ప్రిన్సిపల్ యూ.పద్మజ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

–న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం, అగనంపూడి



కూర్మన్నపాలెం రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో..

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	గాజువాక: 98494 65088
	పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, సింధియా, గాజువాక, పెదగంట్యాడ

?: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో 20ఎ/4/1 నంబర్ గల స్తంభంపై వీధి దీపం వెలగడం లేదు.
-జి.వర్మరాజు, ఇండస్ట్రియల్ కాలనీ.

✓: ఫిర్యాదు పరిశీలించి దీపాన్ని బాగు చేయిస్తాం. -శ్రీనివాస్, వీధి దీపాల నిర్వాహకుడు

?: అగనంపూడి శాంతినగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. 85వ వార్డు పెదమడకలోనూ ఎల్‌ఈడీ దీపాలు మొరాయిస్తున్నాయి. సంజీవకాలనీ బీసీరోడ్డులో 401 ఏ-3-4 స్తంభంపై వీధి దీపాలు పని చేయడం లేదు.
-చంద్రరావు, శాంతినగర్
-మడుగుల నర్సింగరావు, పెదమడక
-సురేష్, సంజీవకాలనీ

✓: ఆయా ప్రాంతాల్లో దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు

స్పందనకు వందనం

వీధి దీపాలకు మరమ్మతులు: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలగని వీధి దీపాల సమస్యపై గతంలో పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన సిబ్బంది గురువారం ఆయా దీపాలను బాగు చేశారు. –న్యూస్‌టుడే, మల్కాపురం

అనధికార నిర్మాణాలకు అడ్డేది..?


అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆరోపణ


క్రాంతినగర్‌లో..

న్యూస్‌టుడే, మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నా... ఆయా నిర్మాణ పనుల్ని అడ్డుకోవడంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువలు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా... కిందిస్థాయి సిబ్బందితో పాటు, ఉన్నత స్థాయి అధికారుల వరకు చూసీచూడనట్టు వదిలేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

● జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవలో అనుమతి లేకుండా ఓ భవనం నిర్మిస్తున్నారు. భవనం కింది అంతస్తులో రోడ్డు వైపున మరో రెండు దుకాణాలు సిద్ధం చేస్తున్నారు. ఈ నిర్మాణంపై సచివాలయం ప్రణాళిక విభాగం సిబ్బంది వివరణ కోరగా... నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోమని యజమానికి సూచించామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

● క్రాంతినగర్‌లో కాలువ, రహదారిని ఆక్రమించి, 62వ వార్డు దుర్గానగర్‌లో గెడ్డను ఆనుకుని భవనాలు నిర్మిస్తున్నా... అధికారులు పట్టించుకోవడం లేదు.


ప్రకాష్‌నగర్‌లో...

● వీటితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో అనుమతులకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా.., సెల్లారు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా... అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని నివాసితులు చెబుతున్నారు. ఈ నిర్మాణాలన్నీ జోన్-5లోని ఓ అధికారి కనుసన్నల్లోనే సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: జెడ్సీ


మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

గాజువాక, న్యూస్‌టుడే : వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని, ఈ సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గాజువాక జోనల్ కమిషనర్ బి.శేషాద్రి అన్నారు. గురువారం జోనల్ కార్యాలయంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం(ఎన్‌వీబీడీసీపీ)లో భాగంగా పీహెచ్‌సీ, మలేరియా, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్సీ మాట్లాడుతూ... మురుగు నీటిలో లార్వా నియంత్రణ చర్యలు చేపట్టాలని, జ్వరపీడితుల రక్తపూతలు సేకరించాలని సూచించారు. ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, జోన్-6 పారిశుద్ధ్య సూపర్‌వైజర్ బీవీ. రామారావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన సిబ్బంది

నేడు క్యాన్సర్ నివారణపై అవగాహన

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: అంతర్జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ మాసోత్సవాల సందర్భంగా నగరంలోని ఒమెగా ఆసుపత్రి, స్టీల్ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కునగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మెయిన్ బర్న్ యూనిట్‌లో జరిగే సదస్సుకు 40 ఏళ్ల పైబడిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని నిర్వాహకులు సూచించారు.

సమస్యల పరిష్కారానికి విన్నపం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వివిధ సమస్యలు పరిష్కరించాలని దువ్వాడ వినియోగదారుల సంఘం కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం వాల్తేరు సీనియర్ డీసీఎం పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దువ్వాడ స్టేషన్‌లో వందేభారత్ రైలు నిలపాలని కోరారు. స్టేషన్ ఆవరణలో ప్రీపెయిడ్ ఆటోలు అందుబాటులో ఉంచాలన్నారు. రిజర్వేషన్ టికెట్ బుకింగ్ కేంద్రాన్ని నాలుగో ప్లాటుఫాంవైపు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లు నిర్మించాలని, ప్లాట్‌ఫాంపై అల్పాహారం, టీ, కాఫీ దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు.

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే..!

క్లిక్ క్లిక్

న్యూస్‌టుడే, ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం): జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పనితీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఏడీ కూడలి పరిసర ప్రాంతాల్లోని హోటల్స్, రెస్టారెంట్స్, మిఠాయి దుకాణాల్లో వ్యర్థాలను తీసుకెళ్లే సమయంలో నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చెత్త తరలించే వాహనాలను ప్రధాన రహదారిలో అడ్డుగా నిలిపేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు చెత్త డబ్బాలను రోడ్డు పక్కనే వదిలేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● అలాగే గోపాలపట్నం పెట్రోల్‌బంకుకూడలిలోని వివిధ దుకాణాల ఎదుట చెత్త సేకరించేందుకు ఆయా వాహనాలను ఎక్కువసేపు నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఇతరులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. చెత్త తరలించే సిబ్బంది పనితీరు, వాహనాల పార్కింగ్‌పై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ధర్నాను విజయవంతం చేయాలి : సిటూ


శిబిరంలో మాట్లాడుతున్న సిటూ నాయకుడు రామారావు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉక్కు సిటూ నాయకుడు ఎన్.రామరావు అన్నారు. గురువారం ఆయన కూర్మన్నపాలెంలో దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఉక్కును నిర్వీర్యం చేసేందుకు కేంద్రం అవలంబిస్తున్న విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్మాగారంలో ఇటీవల జారీ చేసిన వీఆర్ఎస్ ఉత్తర్వులు నిలిపేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, సిటూ నాయకులు కె.గంగాధర్, మోహిద్దీన్, శ్రీనివాస్, కె.బాలశౌరి, మురళీ, రామచంద్రమూర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా గోడపత్రిక ఆవిష్కరణ

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కులో 28న నిర్వహించే ధర్నా గోడపత్రికను గురువారం కర్మాగారంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ... కర్మాగారం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల దృష్ట్యా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు అందరూ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉక్కు ప్రధాన పరిపాలన భవనం కూడలిలో ధర్నా నిర్వహిస్తామన్నారు. ఏఐటీయూసీ, ఇంటక్, సిటూ తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.


గోడపత్రిక ప్రదర్శిస్తున్న కార్మిక నాయకులు

సంక్షిప్త సమాచారం..

● బాధ్యతల స్వీకరణ



అక్కిరెడ్డిపాలెం (నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : గాజువాక జోన్ విద్యుత్తు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా **ఏ.పార్థసారథి** గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆటోనగర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై గాజువాక వచ్చారు. ఇన్నాళ్లు గాజువాకలో పని చేసిన మీనకేతనరావు కార్పొరేట్ కార్యాలయం ప్రాజెక్టు విభాగానికి బదిలీపై వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గాజువాక, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి, తప్పించుకుని తిరుగుతున్న నలుగురు నిందితుల్ని గురువారం క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... శ్రీహరిపురానికి చెందిన భార్గవనాయుడు గత నెల 30న గాజువాక నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో మల్కాపురం, శ్రీహరిపురానికి చెందిన పాత నేరస్థులు ఎన్.మహేశ్‌నాథ్(19), కె. భానుప్రకాశ్(24) స్కూటీని అడ్డగించి బలవంతంగా వెనక సీట్లో కూర్చున్నారు. జింక్ గేటు పక్క నుంచి మింది దారిలోకి తీసుకెళ్లమని ఒత్తిడి చేశారు. ఆటువైపు వెళ్లిన తర్వాత భార్గవనాయుడుని కిందకు తోసేసి స్కూటీతో పరారయ్యారు. అప్పట్లోనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు నిందితులు మహేశ్‌నాథ్, భానుప్రకాశ్‌ను అరెస్టు చేసి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

● ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న అగనంపూడి ప్రాంతానికి చెందిన వెంకటలక్ష్మి (33) ఈనెల 17న స్థానిక బస్‌స్టాపు వద్ద నిరీక్షిస్తున్నారు. ఆ సమయంలో గంగవరానికి చెందిన జి.సూర్యనారాయణ(22), ముత్యాలమ్మపాలెం నివాసి కె. కోదండరావు(26) వెనక నుంచి బైక్‌పై వచ్చి ఆమె చేతిలో బ్యాగ్ లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు నిందితులను అరెస్టు చేసి, వెంకటలక్ష్మికి చెందిన చరవాణి, ఇతర సామగ్రితో పాటు, మరో కేసుకు సంబంధించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితుల్ని రిమాండుకు తరలించారు.

గాజువాక సినిమాలు..

కన్య: దేవర, హెవెన్: జనక అయితేగనక.., శ్రీకన్య: వేట్టయన్, లక్ష్మి: లగ్గం
అరుణ: అన్నపూర్ణ: పొట్టేల్, లక్ష్మీకాంత్: ఎంత పని చేశావ్ చంటి, మోహినీ 70 ఎంఎం: విశ్వం, మినీ మోహినీ, మోహినీ: వెనమ్, విశేష్ : నరుడు బతుకు నటన..
గోపాలపట్నంలో..: శ్రీనరసింహా : పొట్టేల్ నరసింహా: వెనమ్, సౌజన్య: విశ్వం సుకన్య: దేవర, మౌర్య: గ్యాంగ్‌స్టర్

నైపుణ్య శిక్షణతో ఉపాధి

గాజువాక, న్యూస్‌టుడే : చదువుతో పాటు నైపుణ్య శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కేఎస్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఐటీఐ ప్రాంగణంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా, ఉపాధి అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాలు పెంచుకుని, ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేశారు.



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు; హాజరైన అభ్యర్థులు

పని చేసే వారికి పార్టీలో గుర్తింపు : భాజపా


సభ్యత్వ నమోదులో భాజపా ప్రతినిధులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : భాజపా బలోపేతానికి కృషి చేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గురువారం గొంతెనవానిపాలెంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని ప్రధాని మోదీ పాలనకు ప్రజాదరణ ఉందని, సభ్యత్వ నమోదుకు పలువురు మహిళలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. అనంతరం పలువురి వివరాలు నమోదు చేశారు. రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ద్వారపురెడ్డి సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్, జగదీశ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డికి వీడ్కోలు


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మాజీ సీఎం జగన్

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : విజయనగరం జిల్లా గుర్ల మండలం పర్యటనకు వెళ్లిన మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా గుర్లకు వెళ్లిన ఆయన, అక్కడ పర్యటన ముగిసిన తర్వాత అదే హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. లాంజ్‌రూమ్‌లో నగర పార్టీ నాయకులతో సమావేశమై... వివిధ అంశాలపై చర్చించారు. సాయంత్రం 4 గంటలకు ఇండిగో విమానంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు. జగన్‌కు పార్టీ నాయకులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

గాజువాక, న్యూస్‌టుడే : ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో శ్రీనగర్ ఆపిల్-ఐ పాఠశాలకు చెందిన విద్యార్థులు కావ్య, పూర్ణవర్షిణి, లిఖిత, తనుష్క ప్రతిభ చూపి పతకాలు సాధించారు. వారు ఈనెల 26న చిత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గురువారం విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపల్ పమీలా ముఖర్జీ అభినందించారు.


విజేతలను అభినందిస్తున్న ఛైర్మన్ బలరామకృష్ణ, తదితరులు

సందేశాత్మక చిత్రాలకు ఆదరణ


సమావేశంలో పాల్గొన్న చిత్ర బృందం

గాజువాక, న్యూస్‌టుడే : సమాజానికి సందేశాన్ని అందించే చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని 'ఎంత పని చేశావ్ చంటి..' చిత్ర దర్శకుడు ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం బీసీరోడ్డు సాయిబాబా ఆలయ ప్రాంగణంలో చిత్ర బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న తమ చిత్రం విడుదలవుతుందన్నారు. సినిమా అంతా విశాఖ పరిసరాల్లోనే చిత్రీకరించామని, యువత మనోభావాలకు దగ్గరగా రూపొందించామన్నారు. యూనిట్ సభ్యులు బత్తిన సూర్యనారాయణ, అమ్మరాజు, శ్రీనివాస్, నిహారిక, ప్రగ్య గౌతం, శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కొన్ని నెలల కిందట కుటుంబ గొడవల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన వారిని గురువారం దువ్వాడ పోలీసులు తిరిగి వారి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఆ వివరాలు.... వడ్లపూడికి చెందిన మహిళ గత ఏడాది మే నెలలో కుమారుడు, కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబీకులు అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ తన పిల్లల్ని పాఠశాలలో చేర్పించిన అడ్మిషన్ నంబర్ ఆధారంగా రాజమహేంద్రవరంలో ఉన్నట్లు గుర్తించారు. వారిని తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

● అదే ప్రాంతానికి చెందిన మరో మహిళ కొన్నాళ్ల కిందట అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందడంతో దర్యాప్తు ప్రారంభించారు. చరవాణి కాల్ డేటా ఆధారంగా ఆమెను గుర్తించి, దువ్వాడ తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయా కేసుల్లో కీలకంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్స్ సుశీల, సూరిబాబు, కానిస్టేబుల్స్ నవీన్, విజయచంద్రను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

పూడిక తీసి.. మురుగు పారించి..!



ఫోకస్

గాజువాక శివారు ఉక్కు కాలనీల మురుగు కాలువల్లో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోవడంతో నీరంతా స్తంభించేది. తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ప్రజారోగ్య సిబ్బంది గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పెదగంట్యాడ శివారు అయ్యన్నపాలెం, నీలాపువీధి, అగనంపూడి పరిధి పెదమడక, కణితికాలనీల కాలువల్లో పూడిక తొలగించారు. మురుగు కష్టాలు తీరడంతో నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు.

–న్యూస్‌టుడే, గాజువాక

ఇదేం నిర్వహణ..!

విద్యుత్తు సిబ్బంది తీరుపై స్థానికుల అసహనం


పంచవటి సమీపంలో పగలే వెలుగుతున్న దీపం; శిథిలమైన స్తంభం అడుగుభాగం

న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ): జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శివారు పంచవటి టౌన్‌షిప్ పరిసరాల్లో విద్యుత్తు దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. కాలనీ నుంచి షీలానగర్-కాన్వెంట్ పోర్టు రోడ్డుకు అనుసంధాన మార్గం ఉంది. సుమారు అర కిలో మీటరు పొడవులో ఉన్న మార్గంలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆ మార్గంలో రెండు నెలలుగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్తు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకు స్పందించిన సిబ్బంది ఇటీవలే దీపాలకు మరమ్మతులు చేశారు. నాటి నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా దీపాలు వెలుగుతూనే ఉండడంతో విద్యుత్తు వృథా అవుతోంది. దీనికితోడు చాలా స్తంభాల అడుగుభాగాలు శిథిలమైనా, ఎలాంటి పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. కొన్ని స్తంభాలపైకి అల్లుకున్న పచ్చిని పొదుల్ని తొలగించకుండా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగటి పూట దీపాల వెలుగులు నియంత్రించాలని, స్తంభాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆవరణలో అపరిశుభ్రత..!

దర్పణం

న్యూస్‌టుడే, సింధియా: పారిశ్రామిక ప్రాంతం ఏడు వార్డుల ఆసుపత్రిగా పేరొందిన గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ ఆవరణ అపరిశుభ్రతకు చిరునామాగా మారింది. ఎక్కడికక్కడ భవన నిర్మాణ సామగ్రి కుప్పలు, తుప్పు పట్టిన ఇనుప మంచాలు, ఇతర వస్తువులు పడి ఉండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రహరీ చెంత పోగవుతున్న వ్యర్థాల్ని సకాలంలో తరలించడం లేదని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి.. ఆవరణ శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు.


కుప్పగా పోసి వదిలేసిన పిక్క


మెట్ల కింద తుప్పపట్టిన ఇనుప మంచం